ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు , జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -316 పేజీలు - 8 వెల - 03/- మంగళవారం 3 మార్చి 2026



కువైట్‌లో కూలిన అమెరికా యుద్ధ విమానాలు

ఇజ్రాయిల్, హిజ్బొల్లా మధ్య కాల్పులు

ఖమేనీ భార్య మన్సౌరే ఖోజాస్తే మృతి

అమెరికా-ఇజ్రాయిల్ దాడుల్లో ఆమెకు గాయాలు..

# మూడోరోజూ భీకర పోరు

## గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడిన


**న్యూఢిల్లీ,మార్చి 02( రిపబ్లిక్ న్యూస్)**
దాడులు, ప్రతి దాడులతో మధ్య ప్రాచ్యం వణికిపోతోంది. ఇజ్రాయిల్– అమెరికా సేనలు, ఇరాన్ దళాల మధ్య వరుసగా మూడో రోజు కూడా భీకర పోరు సాగుతోంది. బాంబు దాడులతో తమ ప్రియతమ సుప్రీం నేత ఖమేనీని, సీనియర్ అధికారులను అంతం చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్న ఇరాన్ ఇజ్రాయిల్‌పై, గల్ఫ్‌లోని అరబ్ దేశాలపై పెద్ద ఎత్తున క్షిపణులను, డ్రోన్లను ప్రయోగించింది. మరోవైపు ఖమేనీ హత్యకు ప్రతీకారంగా ఇజ్రాయిల్‌పై హిజ్బొల్లా రాకెట్లు, డ్రోన్లతో దాడి చేసింది. బీరూట్ దక్షిణ శివారు ప్రాంతాలపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేసిందని లెబనాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది.
ఖమేనీ మరణానంతరం మరింత రెచ్చిపోయిన అమెరికా, ఇజ్రాయిల్ సైనికులు ఆదివారం ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి స్థావరాలపై బాంబుల వర్షం కురిపించిన విషయం తెలిసిందే. అంతేకాక ఇరాన్ యుద్ధ నౌకలను కూడా అవి ధ్వంసం చేశాయి. కువైట్‌లో అనేక అమెరికా యుద్ధ విమానాలు నేల కూలాయి. అయితే పైలట్లు సురక్షితంగా బయట పడ్డారు. అరబ్ దేశాలపై క్షిపణులు, డ్రోన్లతో ఇరాన్ విరుచుకుపడడాన్ని ఖండిస్తూమిగతా 2లో...



# భారత్ శాంతి, సుస్థిరతలనే కోరుకుంటుంది

**సౌదీ, బహ్రెయిన్, జోర్డాన్ దేశాధినేతలకు మోదీ ఫోన్**
**మోదీకి ధన్యవాదాలు తెలిపిన నెతన్యాహు**

**న్యూఢిల్లీ,మార్చి 02( రిపబ్లిక్ న్యూస్)**
పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. భారత్ ఎప్పుడూ శాంతి, సుస్థిరతలనే కోరుకుంటుందని ప్రధాని మోదీ చెప్పారు. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో కెనడా ప్రధాని కార్నీతో సంయుక్త విలేకరుల సమావేశంలో పాల్గొన్న మోదీ పశ్చిమాసియాలో పరిస్థితులపై మాట్లాడారు. చర్చలు, దౌత్యం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలనేదే భారత విధానమని ఆయన పునరుద్ఘాటించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని మోదీ.. సౌదీ, బహ్రెయిన్, జోర్డాన్ దేశాధినేతలకు ఫోన్ చేశారు. సౌదీ అరేబియా రాజు మొహమ్మద్ బిన్ సల్మాన్‌తో మోదీ మిగతా 2లో...



# బీజేపీ విధానాలపై యుద్ధానికి సిద్ధంకండి

**కాంగ్రెస్ పీఏసీ సమావేశంలో అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు**
**డీసీసీ అధ్యక్షులే మన సైన్యంపని చేయండి..- పదవులు అవే వస్తాయి**
**పార్టీ నిర్మాణంపై దృష్టి సారించండి -వచ్చే రోజులన్నీ మనవేనంటూ దిశా నిర్దేశం**
**వికారాబాద్‌లో ముగిసిన శిక్షణ కార్యక్రమాలు**

హైదరాబాద్ **మార్చి 02( రిపబ్లిక్ న్యూస్)**
ఇండో అమెరికా ట్రేడ్ డీల్ మనకు అత్యంత ప్రమాదకరమని పార్లమెంటులో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రధాని మోడీ చర్యలతో మనదేశంలో సైతం యుద్ధ వాతావరణం నెలకొందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఆయన పూర్తిగా దాసోహమయ్యారని ఎద్దేవా చేశారు. అందుకే మోడీ.. అమెరికాకు వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని పేర్కొన్నారు. ఇరాన్‌లో తలెత్తిన పరిస్థితులు ఇండియాలో రాకుండా చూసుకోవాలని ఆయన దేశ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.మిగతా 2లో...



# దర్యాప్తు అధికారి ముందు హాజరు కండి

**రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు**
**బీహార్ కేడర్ ఐపిఎస్ నాయక్‌కు హైకోర్టు ఆదేశం**




అమరావతి**మార్చి 02( రిపబ్లిక్ న్యూస్)**
ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ వ్యవహారంలో ఈ కేసు దర్యాప్తు చేస్తున్న అధికారి ముందు హాజరు కావాలని బిహార్ కేడర్ ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ నాయక్‌ను హైకోర్టు ఆదేశించింది. మార్చి 5వ తేదీ లేదా అంతకంటే ముందు దర్యాప్తు అధికారి ఎదుటమిగతా 2లో...


# ఏఐ కల్పిత తీర్పులతో జాగ్రత్త

**వాటి వినియోగంతో న్యాయ ప్రక్రియ**
**దుర్వినియోగమయ్యే ప్రమాదం**
**వాటిపై ఆధారపడి తీర్పులు ఇవ్వొద్దు**
**ఏపీ హైకోర్టు తీర్పును పక్కనపెట్టిన సుప్రీం**



**న్యూఢిల్లీ,మార్చి 02( రిపబ్లిక్ న్యూస్)**
కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత ఆధారంగా రూపొందించిన కల్పిత తీర్పు ల విషయంలో జాగ్రత్తగా ఉండాలంటూ దిగు వ కోర్టులను సుప్రీంకోర్టు అప్రమత్తం చేసింది. కల్పిత ఏఐ తీర్పుల ఆధారంగా తీసుకునే నిర్ణయాల వల్ల న్యాయ ప్రక్రియ మిగతా 2లో...

# ప్రజాభిప్రాయం మేరకు నడుచుకోవాలి



**ప్రభుత్వ సేవల్లో లోపం రాకుండా చూడాలి**
**బాణాసంచా ప్రమాదంపై శివకాశికి వెళ్లి స్టడీ**
**అధికారులకు సిఎం చంద్రబాబు సూచన**

అమరావతి, **,మార్చి 02( రిపబ్లిక్ న్యూస్)**
ప్రభుత్వ సేవలపై ప్రజలు సంపూర్ణంగా సంతృప్తి చెందాల్సిందేనని, అధికారులు ఆ మేరకు కృషి చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అధికారుల తీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని తేల్చిచెప్పారు. ఈ నెల నుంచి కనీసం 80 శాతం నుంచి 90 శాతం తగ్గకుండా పబ్లిక్ పర్సెప్షన్ ఉండాలని స్పష్టం చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పాలనలో 'పబ్లిక్ పర్సెప్షన్' కు అధిక ప్రాధాన్యతని స్తున్నారు. సోమవారం ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్‌పై క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ..'పెన్షన్ల పంపిణీలో లోటుపాట్లు తలెత్తుతున్న మిగతా 2లో...

# గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న ప్రవాసాంధ్రులను సురక్షితంగా తీసుకురావాలి: జగన్

అమరావతి, **,మార్చి 02( రిపబ్లిక్ న్యూస్)**



మధ్య ప్రాచ్య దేశాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో అక్కడ చిక్కుకుపోయిన ప్రవాసాంధ్రులను తక్షణమే సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావాలని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వాన్ని కోరారు. గల్ఫ్ దేశాల్లో ఏపీకి చెందిన వేలాది మంది ఉపాధి పొందుతున్నారని, ప్రస్తుతం అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల వల్ల వారి భద్రత ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు.అక్కడ అనిశ్చితి నెలకొనడంతో పాటు పలు విమానాశ్రయాల్లో ఆంక్షలు, విమాన సర్వీసుల రద్దు కారణంగా చాలామంది ఎక్కడికక్కడ చిక్కుకుపోయిమిగతా 2లో...

# ఏపీ టీచర్లకు కొత్త అటెండెన్స్ రూల్స్..



## ఇక నిమిషం ఆలస్యమైనా 'లేట్'

**ఉదయం 9 గంటలలోపు పాఠశాలలకు హాజరు తప్పనిసరి**
**హాఫ్-డే లీవులు, ఔట్-టైమ్‌పైనా కఠినమైన రూల్స్ జారీ**
**నిమిషం ఆలస్యమైనా సెలవుగా పరిగణిస్తామని హెచ్చరిక**
**కొత్త నిబంధనలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు**

అమరావతి, **,మార్చి 02( రిపబ్లిక్ న్యూస్)**
ఏపీలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల హాజరుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ కొత్త, కఠినమైన నిబంధనలను అమల్లోకి తెచ్చింది. క్రమశిక్షణ, సమయపాలనను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ మార్గదర్శకాలను జారీ చేసింది. ఇకపై ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఉదయం 9 గంటలలోపు పాఠశాలలకు మిగతా 2లో...

# బీజేపీ విధానాలపై యుద్ధానికి సిద్ధంకండి

బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై యుద్ధానికి సిద్ధం కావాలని కాంగ్రెస్ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో తొమ్మిది రోజులపాటు కొనసాగిన తెలంగాణ, ఏపీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల (డీసీసీలు) శిక్షణా తరగతులు సోమవారం ముగిశాయి.

ముగింపు కార్యక్రమానికి రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీంతోపాటు కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశాన్ని కూడా నిర్వహించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళికబద్ధంగా తీసుకోవాల్సిన చర్యలపై డీసీసీలకు రాహుల్‌గాంధీ దిశా నిర్దేశం చేశారు. అంతర్జాతీయ, జాతీయ రాజకీయాల్లో నెలకొన్న పరిణామాల గురించి ఆయన వారితో చర్చించారు. కాంగ్రెస్ పార్టీ అహింసా వాదాన్ని నమ్ముతూ రాజకీయాలు చేస్తుంటే.. బీజేపీ హింసావాదంతో ముందుకు సాగుతోందని విమర్శించారు. తాము గాంధేయ వాదాన్ని అనుసరిస్తే.. బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు గాడ్సే బాటలో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని దుయ్యబట్టారు. ప్రధాని మోడీ దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన దుర్మార్గాలన్నీ ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని చెప్పారు.

వాటన్నింటినీ ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. డీసీసీ అధ్యక్షులే తమ పార్టీకి అసలైన సైన్యమని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అందువల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పార్టీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో వారి పాత్రను మరింత పెంచుతామని భరోసానిచ్చారు. ఏఐసీసీ దేశవ్యాప్త పిలుపులను నూటికి నూరుశాతం జయప్రదం చేయాలని సూచించారు. తెలంగాణ, ఏపీల్లోని



సామాజికాంశాలపై అధ్యయనం చేయాలని అన్నారు. తెలంగాణలో పార్టీ, ప్రభుత్వం జోడెడ్లలాగా పని చేస్తున్నాయని కితాబిచ్చారు. సీనియర్ నేతలు, కార్యకర్తలు, నాయకులను కలుపుకుని ముందుకు పోవాలని రాహుల్ ఈ సందర్భంగా సూచించారు. అహాన్ని పక్కనపెట్టి పని చేయాలని హితవు పలికారు. 'ఇగో'ల కంటే పార్టీ ముఖ్యమనే విషయాన్ని గుర్తెరగాలని అన్నారు. ఒక్కో డీసీసీ అధ్యక్షుడు మరో పదిమంది క్రియాశీలక నాయకుల్ని తయారు చేయాలని దిశా నిర్దేశం చేశారు. పని చేస్తున్న వారిని గుర్తించి, ప్రోత్సహించాలని కోరారు.

మార్షల్ ఆర్ట్స్‌తో క్లాస్‌డ

సమావేశంలో రాహుల్ గాంధీ మార్షల్ ఆర్ట్స్ చేస్తూ వినూత్నంగా సందేశమిచ్చారు. అందులోని మెళకువలను డీసీసీ అధ్యక్షులకు వివరించారు. మార్షల్ ఆర్ట్స్‌ను వ్యక్తిగత జీవితానికి అన్వయించుకోవాలని సూచించారు. జాతిపిత మహాత్మా గాంధీకి ఒంటిపై ఒక బట్ట తప్ప ఏమీ ఉండదని గుర్తు చేశారు. అంతటి నిరాడంబరుణ్ని బ్రిటీష్ వారు సైతం ఏమీ చేయలేకపోయారని పేర్కొన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రజలతో మమేకమై పని చేయాలని పిలుపునిచ్చారు. కష్టించి పని చేయండి.. రానున్న రోజులన్నీ మనవేనంటూ భరోసానిచ్చారు.

కాంగ్రెస్ శివుడు.. బీజేపీ విష్ణువుడ

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీని శివుడితో పోల్చారు. తనలో సగభాగాన్ని భార్యకు ఇచ్చిన శివుడు, నిరాడంబరంగా ఉంటారని గుర్తు చేశారు. అదే రకంగా కాంగ్రెస్ పద్ధతి సాధారణంగా ఉంటుందని తెలిపారు. అందుకు భిన్నంగా బీజేపీ విష్ణువులాగా నగలు నట్రాతో ఆడంబరంగా, అత్యంత విలాసంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. వాటిని కాపాడుకోవటానికే ఆ పార్టీ ప్రజల మీద ఆయుధా(అధికారం)న్ని ప్రయోగిస్తోందని ఎద్దేవా చేశారు.

దేశం కోసం ప్రధాని అవుతా..

కాగా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూడ రాహుల్ గాంధీ దేశానికి ప్రధాని కావాలంటూ విజ్ఞప్తి చేశారు. ఆయన తాత నెహ్రూ, నానమ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాజీవ్ గాంధీ ప్రధాని పదవిని చేపట్టి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని గుర్తు చేశారు. అదే తరహాలో ఇప్పుడు దేశాన్ని రక్షించేందుకు, విపత్కర పరిస్థితులనుంచి బయటపడేసేందుకు రాహుల్ గాంధీ కూడా పీఎం పదవిని చేపట్టాలని కోరారు. తాను ఓ ముఖ్యమంత్రిగా ఈ విజ్ఞప్తి చేయటం లేదని.. సాధారణ కాంగ్రెస్ కార్యకర్తగా అభ్యర్థిస్తున్నానని తెలిపారు. స్పందించిన రాహుల్ గాంధీ మోడీపై యుద్ధం చేసేందుకు ప్రధాని పదవిని చేపడతానని వ్యాఖ్యానించారు.

# ప్రజాభిప్రాయం మేరకు నడుచుకోవాలి

స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆర్టీసీ బస్సు సర్వీసులు బావున్నా.. ఆర్టీసీ బస్ స్టేషన్‌లో సౌకర్యాలు, ఔట్ సోర్సింగ్ సర్వీసులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. బస్ స్టేషన్‌కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా ఉండాలి. రాష్ట్రంలో వరుస ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలి, ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలి. బాణసంచా పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై అధికారులు శివకాశీకి

వెళ్లి అధ్యయనం చేసిరావాలన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, డిజిటల్ సేవలు, సిబ్బంది పనితీరు బాగుంది. అవినీతికి తావులేకుండా రాష్ట్రంలోని మొత్తం 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిజాయితీ కలిగిన అధికారులకే అవకాశం ఇవ్వాలి. వాట్సప్ మనమిత్ర సేవలు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి, నూటికి నూరు శాతం వాట్సప్ సేవల వినియోగం జరగాలి. అన్ని శాఖల పనితీరు మెరుగు పరుచుకునేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని అన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆర్టీజీఎస్, ఏపీ ఎన్ఆర్టీఎస్ అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, కువైట్ వంటి దేశాల్లో చిక్కుకున్న ప్రయాణికులను స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం, విదేశాంగ శాఖతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని సీఎం సూచించారు.

యుద్ధం, విమాన సర్వీసుల రద్దు కారణంగా ఇబ్బందులు పడుతున్న వారిని వెంటనే గుర్తించి సహాయం అందించాలన్నారు. ఆయా దేశాల్లోని భారతీయ ఎంబసీలతో నిరంతరం టచ్‌లో ఉంటూ సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆర్టీజీఎస్, ఏపీ ఎన్ఆర్టీఎస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. గల్ఫ్ దేశాల్లోని తెలుగు వారు ఎవరూ ఆందోళన చెందవద్దని, విమానాశ్రయాలు తిరిగి తెరుచుకుని సర్వీసులు ప్రారంభమయ్యే వరకు సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని చంద్రబాబు సూచించారు. ఏపీ ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏపీ ఎన్ఆర్టీఎస్ కోఆర్డినేటర్ల ద్వారా అవసరమైన వారికి తాత్కాలిక వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా విమానాశ్రయాల్లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని రాష్ట్ర ఎన్నారై శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. బాధితుల కోసం ప్రభుత్వం 24 గంటల పాటు పనిచేసే ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్లను ఏర్పాటు చేసింది.

హెల్ప్‌లైన్ నెంబర్లు:

ఫోన్: 0863-2340678

వాట్సాప్: 85000 27678

అలాగే helpline@apnrts.com, info@apnrts.com ఈమెయిల్స్ ద్వారా లేదా https://apnrts.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా సంప్రదించి తక్షణ సహాయం పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు.

### గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన వారిని క్షేమంగా వెనక్కి తీసుకురండి:

### అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

మధ్య ప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన ఏపీ వాసులను క్షేమంగా వెనక్కి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని

మొదటిపేజీ తరువాయి

# ఏపీ టీచర్లకు కొత్త అటెండెన్స్ రూల్స్..

తప్పనిసరిగా చేరుకోవాలని స్పష్టం చేసింది. ఆ సమయం తర్వాత హాజరు నమోదు చేస్తే దానిని 'లేట్ ఇన్'గా పరిగణిస్తారు.కొత్త నిబంధనల ప్రకారం నెలలో ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే 10 నిమిషాల గ్రేస్ పీరియడ్ (వెసులుబాటు సమయం) ఉంటుంది. ఇక హాఫ్-డే సెలవు తీసుకునే వారికి కూడా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఉదయం సెలవు పెట్టి మధ్యాహ్నం విధులకు హాజరయ్యేవారు ఒంటి గంట లోపు హాజరు నమోదు చేయాలి. ఆ తర్వాత వస్తే 'లేట్ ఇన్'గా లెక్కిస్తారు. అలాగే ఉదయం విధులకు హాజరై మధ్యాహ్నం సెలవు పెట్టేవారు 12:30 గంటల కంటే ముందు 'ఔట్ టైమ్' నమోదు చేయకూడదు. పాఠశాల ముగిసే సమయానికి సంబంధించి కూడా నిబంధనలను కఠినతరం చేశారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సాయంత్రం 3:30 గంటల కంటే ఒక్క నిమిషం ముందు ఔట్ టైమ్ నమోదు చేసినా, ఉన్నత పాఠశాలల టీచర్లు సాయంత్రం 4 గంటల కంటే ముందు నమోదు చేసినా దానిని 'ఎర్లీ ఔట్'గా పరిగణిస్తారు. ముఖ్యంగా ఉదయం ఇన్-టైమ్ నమోదు చేసి, సాయంత్రం ఔట్-టైమ్ నమోదు చేయడం మరిచిపోతే, వారు ఆ రోజంతా గైర్హాజరైనట్లే లెక్క. అంటే ఉదయం వచ్చిన వెంటనే వెళ్లిపోయినట్లుగా భావిస్తారు. **నిబంధనలపై ఉపాధ్యాయ సంఘాల వ్యతిరేకత** :పాఠశాల విద్యాశాఖ తీసుకున్న ఈ నిర్ణయంపై తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. నిమిషం ఆలస్యమైనా గైర్హాజరుగా పరిగణించడం సరికాదని అభిప్రాయపడింది. గతంలో ఉన్న 10 నిమిషాల గ్రేస్ పీరియడ్‌ను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేసింది. హాజరు నమోదు చేసే యాప్ కొన్నిసార్లు సరిగా పనిచేయదని, అటువంటి సాంకేతిక సమస్యలకు ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం అన్యాయమని పేర్కొంది. ప్రభుత్వం తమను "ఎంప్లాయీస్ ఫ్రెండ్లీ"గా చెప్పుకుంటూ ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకోవడం విరుద్ధమని సంఘం నేతలు అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిబంధనలపై పునరాలోచిస్తుందా? లేక యథాతథంగా అమలు చేస్తుందా? అనేది వేచి చూడాలి.

# దర్యాప్తు అధికారి ముందు హాజరు కండి

హాజరు కావాలని జారీ చేసిన ఆ ఆదేశాల్లో నాయక్‌కు హైకోర్టు స్పష్టం చేసింది. ఎలాంటి కఠిన చర్యలకు పాల్పడకుండా చట్టంలోని నిబంధనలను లోబడి సునీల్ కుమార్ నాయక్‌ను విచారించాలని దర్యాప్తు అధికారికి ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు సూచించింది. ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సోమవారం ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు పై విధంగా స్పందించింది. ఇక మార్చి 9వ తేదీకి సునీల్ కుమార్ ప్రధాన బెయిల్ పిటిషన్ విచారణను హైకోర్టు వాయిదా వేసింది. ఈ సందర్భంగా రాజకీయ కారణాలతో తన పిటిషనర్‌ను నిందితుడిగా చేర్చారంటూ సునీల్ తరఫు సీనియర్ న్యాయవాది పరమేశ్వర్ వాదనలు వినిపించారు. ఈ కస్టోడియల్ టార్చర్‌తో సునీల్ నాయక్‌కు సంబంధం లేదని కోర్టు దృష్టికి ఈ సందర్భంగా పరమేశ్వర్ తీసుకెళ్లారు. ఇంకోవైపు సునీల్ నాయక్ వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌కు విచారణ అర్హత లేదని పోలీసుల తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా కోర్టుకు వివరించారు. అలాగే సునీల్ నాయక్ ముందస్తు బెయిల్ కోరుతూ వేసిన పిటిషన్‌ను గుంటూరు కోర్టు గతంలో కొట్టి వేసిందంటూ హైకోర్టు దృష్టికి సిద్ధార్థ్ లూథ్రా తీసుకెళ్లారు. పోలీసుల మొదట నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పేరు లేదనే కారణంతో పిటిషనర్ దర్యాప్తు నుంచి తప్పించుకో లేరని హైకోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఎఫ్ఐఆర్‌లో అందరి నిందితుల పేర్లు చేర్చాల్సిన అవసరం లేదని.. ఈ కేసు దర్యాప్తు సాగుతున్నకొద్ది మరికొంతమంది నిందితులను చేర్చే అవకాశం ఉంటుందని హైకోర్టు పేర్కొంది. దర్యాప్తునకు సహకరించాల్సిన చట్టబద్ధమైన విధి పిటిషనర్‌కు ఉందని హైకోర్టు తెలిపింది.

# ఏఐ కల్పిత తీర్పులతో జాగ్రత్త

దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉన్నదని హెచ్చరించింది. ఏఐ కల్పిత తీర్పులు సరైన న్యాయ ప్రమాణాలతో ఉన్నాయనే కారణంగా వాటిని ఉత్తర్వుల్లో ఉటంకించడాన్ని అనుమతిం చరాదని స్పష్టం చేసింది. ఏపీ హైకోర్టు ఓ కేసులో ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ అంశంపై సుప్రీంకోర్టు స్పందించింది. ఏపీ హైకోర్టు తీర్పును పక్కనబెట్టింది. ఓ ఆస్తి వివాదంలో దిగువ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై ఇంజక్షన్ ఆర్డర్ ఇవ్వాలంటూ ఏపీ హైకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలైంది. ఆ ఉత్తర్వులు ఇచ్చే సమయంలో దిగువ కోర్టు ఏఐ కల్పిత తీర్పులను తన ఉత్తర్వుల్లో పేర్కొందని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. పిటిషన్‌లో లేవనెత్తిన అభ్యంతరాలను ఏపీ హైకోర్టు అంగీకరించింది. అయితే, దిగువ కోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యానికి మాత్రం నిరాకరించింది. ఈ మేరకు గత ఏడాది ఆగస్టులో తీర్పును ఇచ్చింది. దీనిపై పిటిషనర్లు గత జనవరిలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. న్యాయ మూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన బెంచ్ ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. పిటిషనర్ల వాదనను బెంచ్ అంగీకరించింది. పిటిషనర్ వ్యాజ్యాన్ని మరోసారి విచారించాలని, ఈసారి ఏఐ కల్పిత తీర్పులతో నిండిన అడ్వకేట్-కమిషనర్ నివేదికపై ఆధార పడొద్దని ఏపీ హైకోర్టును ఆదేశించింది. ఏఐ కల్పిత తీర్పుల విషయంలో చేపట్టాల్సిన చర్యలను సూచించాలంటూ సొలిసిటర్ జనరల్‌కు, భారత బార్ అసోసియేషన్‌కు బెంచ్ నోటీసులు జారీచేసింది.

## భారత్ శాంతి, సుస్థిరతలనే కోరుకుంటుంది

మాట్లాడారు. సౌదీపై జరిగిన దాడులను ఆయన ఖండించారు. భారతీయులను జాగ్రత్తగా చూసుకుంటున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫాతోనూ మోదీ ఫోన్‌లో మాట్లాడి భారతీయుల క్షేమ సమాచారం గురించి ఆరా తీశారు. జోర్డాన్ రాజు అబ్దుల్లా-2తో కూడా మోదీ ఫోన్‌లో మాట్లాడారు. మరోవైపు, మోదీకి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ధన్యవాదాలు తెలిపారు. తమకు అండగా నిలిచిన స్నేహితుడు మోదీకి ధన్యవాదాలంటూ ఆయన భారతీయ మీడియా ప్రతినిధులతో అన్నారు.

### గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న ప్రవాసాంధ్రులను సురక్షితంగా తీసుకురావాలి: జగన్

మధ్య ప్రాచ్య దేశాల్లో నెలకొన్న తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జగన్ పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. గల్ఫ్ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలతో సంప్రదింపులు జరిపి, ప్రత్యేక ఏర్పాట్ల ద్వారా తెలుగు వారందరినీ వెనక్కి రప్పించేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.అలాగే, అక్కడి వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు వారి కుటుంబ సభ్యులకు తెలియజేసేందుకు రాష్ట్రంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, హెల్ప్‌లైన్ నెంబర్లను అందుబాటులోకి తేవాలని సూచించారు. ప్రవాసాంధ్రుల భద్రత, వారి సురక్షిత ప్రయాణం ప్రభుత్వ బాధ్యతని, ఈ సంక్షోభ సమయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి సత్వరమే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మూడోరోజూ భీకర పోరు

అమెరికా, బహ్రెయిన్, జోర్డాన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈలు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

పశ్చిమాసియాలో చెలరేగిన హింస రోజు రోజుకూ తీవ్రతరం అవుతోంది. ఇరాన్‌తో మొదలైన ఘర్షణ నాలుగు వారాల పాటు కొనసాగవచ్చుంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన నేప థ్యంలో పశ్చిమాసియా నగరాలలో నివసిస్తున్న భారతీయులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక గల్ఫ్ దేశాలలో పరిమిత సంఖ్యలలో బేస్‌మెంట్ షెల్టర్లు, భవనాలలో బాంబు షెల్టర్లు ఉండడమే దీనికి కారణం. ఇరాన్‌పై అమెరికా జరుపుతున్న దాడులకు ప్రతిగా వైమానిక దాడులు జరగవచ్చునంటూ గల్ఫ్ దేశాలలో సైరన్లను మోగిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. దీంతో గల్ఫ్‌లో పెద్ద సంఖ్యలో ఉపాధి పొందుతున్న కేరళీయులు భయం భయంగా కాలం గడుపుతున్నారు.

ఇరాన్‌లో వెయ్యికి పైగా లక్ష్యాలపై దాడులు

'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' సందర్భంగా కువైట్‌లో ముగ్గురు అమెరికా సైనికులు మరణించారని, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని పెంటగాన్ ధృవీకరించింది. లక్ష్యాన్ని సాధించేంత వరకూ పోరాటాన్ని ఆపేది లేదని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌లోని వెయ్యికి పైగా లక్ష్యాలపై అమెరికా సైన్యం దాడులు జరుపుతోంది. అటు ఇజ్రాయిల్ కూడా రాజధాని టెహ్రాన్‌లోని కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటోంది. అనేక చోట్ల పేలుడు శబ్దాలు వినిపిస్తున్నాయి. లెబనాన్ రాజధాని, హెజ్బొల్లాకు గట్టి పట్టున్న బీరూట్‌పై ఇజ్రాయిల్ రక్షణ దళాలు వైమానిక దాడులు ప్రారంభించాయి. మరోవైపు హెజ్బొల్లాతో నెలకొన్న ఉద్రిక్తత నేపథ్యంలో దక్షిణ లెబనాన్‌లోని పలు గ్రామాల ప్రజలను ఖాళీ చేయించాలని ఇజ్రాయిల్ ఆదేశాలు జారీ చేసింది. తమపై దాడి చేస్తే ఊరుకునేది లేదని, ప్రతీకారం తప్పదని ఖతార్ హెచ్చరించింది. ఇరాన్ వైమానిక దాడుల కారణంగా బహ్రెయిన్, యూఏఈలోని అమెజాన్ క్లౌడ్ యూనిట్ల డేటా సెంటర్లలో విద్యుత్, కనెక్టివిటీ సమస్యలు తలెత్తాయి.

**ఆరు వేల విమాన సర్వీసులు రద్దు**

తన గగనతలాన్ని పాక్షికంగా, తాత్కాలికంగా మూసివేస్తున్నానని జోర్డాన్ ప్రకటించింది. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఆరు వేలకు పైగా విమాన సర్వీసులను రద్దు చేశారు. వీటిలో ఎమిరేట్స్, ఇతిహాద్, ఇండియో విమానాలు అధిక సంఖ్యలో ఉన్నాయి.


**నెతన్యాహూ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకున్నాం : ఇరాన్ గార్డ్స్**

ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కార్యాలయాన్ని, ఆ దేశ వైమానిక దళ కమాండర్ కేంద్ర కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకొని క్షిపణి దాడులు చేస్తున్నామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ తెలిపారు. కాగా ఇరాన్ దళాలు తమ విద్యుత్ కేంద్రంపై, ఓ ఇంధన స్థావరంపై దాడులు చేశాయని ఖతార్ రక్షణ మంత్రిత్వ శాఖ చెప్పింది. ఇదిలావుండగా ఇరాన్ రక్షణ మంత్రిగా రివల్యూషనరీ గార్డ్స్ జనరల్ మజీద్ ఎబ్‌నెల్‌రెజాను దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ నియమించారు.

**ఇరాన్‌లో 555 మంది మృతి**

ఇజ్రాయిల్, అమెరికా దాడుల కారణంగా ఇప్పటి వరకూ 555 మంది చనిపోయారని ఇరాన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలియజేసింది. దేశంలోని 131 నగరాలపై దాడులు జరిగాయని వివరించింది. ఒక్క ఫార్స్ రాష్ట్రంలోనే 35 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇదిలావుండగా కువైట్‌లో అమెరికాకు చెందిన అలీ అల్ సలేం వైమానిక స్థావరాన్ని, హిందూ మహా సముద్రంలోని నౌకలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని ఇరాన్ తెలిపింది. ఈ దాడులలో పదిహేను క్రూయిన్ క్షిపణులను ప్రయోగించామని చెప్పింది. సౌదీ అరేబియాలోని రాస్ తనూరా చమురు శుద్ధి కేంద్రంపై కూడా ఇరాన్ డ్రోన్ దాడి జరిపింది. టెల్ అవీవ్‌లోని ప్రభుత్వ భవనాల సమూదాయం పైన, హైఫాలోని భద్రత-సైనిక కేంద్రాల పైన, తూర్పు జెరుసలేం పైన ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ దాడి చేశారు.

ఈ దాడులలో ఖైబార్ బాలిస్టిక్ క్షిపణులను ఉపయోగించారు. కువైట్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై ఇరాన్ క్షిపణులను ప్రయోగించింది. దీంతో అక్కడ నివసిస్తున్న తన దేశీయులకు అమెరికా హెచ్చరికలు జారీ చేసింది. ఇరాక్‌లో అమెరికా సైనికులు మకాం వేసిన ఎర్బిల్ విమానాశ్రయంపై ఇరాన్ మూడు డ్రోన్లను ప్రయోగించగా వాటిని కూల్చివేసినట్లు భద్రతా దళాలు తెలిపాయి. అమెరికా దళాలకు సాయం చేస్తే దాడులు తప్పవని సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, కువైట్, బహ్రైన్ దేశాలను ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్‌పై జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఐరాస అణు ఏజెన్సీ ప్రతినిధులు వియన్నాలోని ఐఏఈఏలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. అదే సమయంలో 35 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఐఏఈఏ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ కూడా భేటీ అయ్యారు.



**నాలుగైదు వారాలపాటు దాడులు : ట్రంప్**

అవసరమైతే ఇరాన్‌పై నాలుగైదు వారాల పాటు సైనిక దాడులు కొనసాగిం చాలని భావిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. సైనిక చర్యలను ఉధృతం చేయడం కష్టమేమీ కాదని అన్నారు. అయితే ఈ పోరులో ప్రాణనష్టం జరిగే అవకాశం ఉన్నదని తెలిపారు. వెనిజులా తరహాలో ఇరాన్‌లో అధికార మార్పిడి జరగాల్సి ఉన్నదని చెప్పారు. దాడులను కొనసాగించేందుకు తమ వద్ద అవసరమైన దళాలు, క్షిపణులు, ఆయుధ సామగ్రి అందుబాటులోనే ఉన్నాయని అంటూ యుద్ధం కొనసాగితే ప్రాణనష్టం పెరుగుతుందని తెలిపారు. ఇజ్రాయిల్, అమెరికా సేనలు ఇరాన్ నౌకా దళాన్ని దెబ్బ తీశాయని, తొమ్మిది నౌకలను, నౌకాదళ కార్యాలయాన్ని ధ్వంసం చేశాయని వివరించారు. ఇరాన్‌పై జరుపుతున్న దాడులకు గల్ఫ్ సాయం అవసరమని తాను భావించడం లేదని ట్రంప్ అన్నారు.

# నంద్యాల మతసామరస్యానికి ప్రతీక: మంత్రి ఫరూక్

**నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో రంజాన్ మాసం పురస్కరించుకుని ఇఫ్తార్ విందు సమావేశం.**

**. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి ఫరూక్**

**. అన్ని మతాల పర్వదినాలు నిర్వహించడం నంద్యాల ఐఎంఏ సాంప్రదాయం: డాక్టర్ రవి కృష్ణ**



**నంద్యాల ఫిబ్రవరి 2( రిపబ్లిక్ న్యూస్) :**
భారతీయ వైద్య సంఘం నంద్యాల శాఖ ఆధ్వర్యంలో, నంద్యాల ఐఎంఏ ముస్లిం వైద్యుల నిర్వహణలో పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని ఇఫ్తార్ విందు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.

ఐఎంఏ నంద్యాల కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ నిర్వహణలో ఉపవాస దీక్ష విరమణ, తదుపరి మౌలానా అబ్దుల్ హాది ఆధ్వర్యంలో ప్రార్ధనలు నిర్వహించారు. ఉపవాసం పాటిస్తున్న వైద్యులు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ఐఎంఏ కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ రవి కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి ఇందులో పాల్గొన్నారు. తదుపరి ఇఫ్తార్ విందు సమావేశంలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ముఖ్యఅతిథిగా, నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ గౌరవ అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల పట్టణం మతసామరస్యానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.తెలుగుదేశం పార్టీ లౌకిక తత్వానికి కట్టుబడి ఉందని అన్నారు.ఐఎంఏ వైద్యులు హిందూ పర్వదినాలు, క్రిస్మస్, రంజాన్ ఇఫ్తార్ సమావేశాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇది ఐక్యతకు, సంఘీభావానికి దోహదం చేస్తుందన్నారు. నంద్యాల వైద్యులు సేవా దృక్పథం కలిగిన వారని అభినందించారు. వారి సమస్యల పరిష్కారానికి సహకారం అందజేస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాలలో హిందూ ముస్లిం ఐక్యత కోసం తాము ఎల్లప్పుడూ ముందుంటామని అన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఐఎంఏ ఆధ్వర్యంలో నంద్యాల వైద్యులు సంక్రాంతి, ప్రీ క్రిస్మస్, రంజాన్ ఇఫ్తార్ సమావేశాలు ఆనవాయితీగా చేస్తున్నామని, ఇది మతసామరస్యానికి, భిన్నత్వంలో ఏకత్వం కొనసాగించడానికి దోహదం చేస్తాయని అన్నారు. నంద్యాలలో మతసామరస్యం కొనసాగడానికి మంత్రి ఫరూక్ కృషి మరువలేమన్నారు. సీనియర్ వైద్యులు డాక్టర్ జఫరుల్లా, ఐఎంఏ నంద్యాల కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ నంద్యాల వైద్యులు ఐకమత్యంతో ఉండి ప్రజలకు మంచి సేవలు అందించడంలో ముందున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ ఖలీల్ మనీయార్, తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా వైద్యుల విభాగం అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రెడ్డి, రాష్ట్ర ఐఎంఏ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, డాక్టర్ మధుసూదన రావు,సీనియర్ వైద్యులు డాక్టర్ బాబన్, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, డాక్టర్ జఫరుల్లా, డాక్టర్ మహమ్మద్ రఫీ, డాక్టర్ మహబూబ్ బాషా, డాక్టర్ జహంగీర్,డాక్టర్ మహమూద్, డాక్టర్ హషమ్, డాక్టర్ మహ్మద్ రఫీ,డాక్టర్ ఆర్షద్, పెద్ద స్వామి, డాక్టర్ షబ్నం,డాక్టర్ అరిఫా భాను, డాక్టర్ జాస్మిన్ సుల్తానా, డాక్టర్ ఫాతిమా బి, డాక్టర్ చరిష్మా, ఫర్హీన్, నంద్యాల మహిళా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి, అధిక సంఖ్యలో వైద్యులు ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.

# గ్లోబల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభించిన డాక్టర్ రవి కృష్ణ

**. పేద విద్యార్థులకు ఫీజు రాయితీ తో శిక్షణ: నిర్వాహకుడు మజీద్.**

**- ఏ రంగాన్ని ఎంచుకున్నా, కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి: డాక్టర్ రవికృష్ణ**



**నంద్యాల ఫిబ్రవరి 2( రిపబ్లిక్ న్యూస్) :**
స్థానిక బాలాజీ కాంప్లెక్స్ కళ్యాణమండపం రోడ్డులో కళారాధన సాంస్కృతిక సంస్థ సమాచార సాంకేతిక విభాగ కార్యదర్శి మజీద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్లోబల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ ప్రారంభించారు.

ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో విద్యార్థులు భవిష్యత్తులో ఏ రంగం ఎంచుకున్నప్పటికీ కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి అని అన్నారు. అనేక సంవత్సరాలుగా కంప్యూటర్ శిక్షకుడిగా పనిచేసిన అనుభవం కలిగి,కళారాధన సమాచార సాంకేతిక విభాగం కార్యదర్శిగా ఉన్న మజీద్ నూతన కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభించడం అభినందనీయం అన్నారు.

ఈ సందర్భంగా శిక్షణ కేంద్రం మజీద్ మాట్లాడుతూ తనతోపాటు సమద్ విద్యార్థులకు కంప్యూటర్ బేసిక్స్, జావా, ఎం.ఎస్. ఆఫీస్, ఇంటర్నెట్ తదితర అంశాలలో కంప్యూటర్ శిక్షణ కోర్సులు నిర్వహిస్తామని తెలిపారు. 16 కంప్యూటర్ సిస్టమ్స్ తో యువతీయువకులకు వేరువేరుగా ఏర్పాటు చేశామని అన్నారు.

కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శి రంగనాథ్ సెంటర్ పర్యవేక్షకుడిగా వ్యవహరిస్తారని తెలిపారు. కళారాధన, లయన్స్ క్లబ్, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం తరపున నేర్చుకోవడానికి వచ్చే విద్యార్థులకు ఫీజులో రాయితీ ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంపీ వి రమణయ్య, కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.ఆర్.ఎస్ ప్రసాద్, మాతృభాష పరిరక్షణ సమితి కార్యదర్శి అన్నెం శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ పిజి కాలేజీ ప్రొఫెసర్ ఇంతియాజ్ అహ్మద్,లయన్స్ క్లబ్ సభ్యులు వాసు, రామయ్య,కళారాధన సభ్యులు శివరామిరెడ్డి,వలి, మహబూబ్ బాషా,ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# లలిత కళాభిరామ పింఛము అవార్డు గ్రహీత బొప్పా ఈశ్వర్ గౌడ్



**నంద్యాల, మార్చి 2, (రిపబ్లిక్ న్యూస్):ఠ**
తెలంగాణ ప్రభుత్వం భాష సంస్కృతి శాఖ సౌజన్యంతో ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో లలిత కళాభిరామ పింఛన్ వారి ఆధ్వర్యంలో 21 వ వార్షిక పురస్కార్ రవీంద్ర భారతిలో లలిత కళాభిరామ అవార్డు ను చెక్క భజన గురువు బొప్పా ఈశ్వర్ గౌడ్ కు కళాభిరామ పింఛన్ అధ్యక్షులు గొల్లపల్లి జయన్న అందజేశారు. నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం, గుండంపాడు గ్రామానికి చెందిన బొప్పా వెంకటసుబ్బమ్మ, బాలనాగన్న దంపతులకు నలుగురు సంతానం అందులో మొదటి కుమారుడు బొప్పా ఈశ్వర గౌడ్ చిన్ననాటి నుండి చెక్కభజన పట్ల ఆసక్తి ఉండేది అది గమనించిన వారి తండ్రి బాలనాగన్నగా కుమారుని ఎలాగైనా చదువుతోపాటు చెక్కభజన కూడా నేర్పించాలని వారి ఊర్లో జరిగేటి తిరునాళ్లకు చెక్కభజన బృందం వచ్చేది ఆ కార్యక్రమాన్ని చిన్నవాడని ఈశ్వరుని తీసుకెళ్తూ స్వామివారి దర్శనం అనంతరం చెక్కభజనను తిలకించేవారు చెక్కభజన మీద ఇష్టంతో అతను మహాదేవపురం స్కూల్లో చదువుకుంటూ తండ్రికి వ్యవసాయంలో సహాయం చేసేవాడు తన పదవ తరగతి ఉన్నప్పుడు తను తండ్రి మరణించగా కుటుంబ భారం తనపై పడేది తల్లి తో పాటు వ్యవసాయం చేసుకుంటూ చదువుకుంటూ ఉండేవారు 2002 సంవత్సరము లో నాయన పల్లి గ్రామానికి చెక్క భజన గాన కోకిల మున్నెల్లి ఓబులేసు గాజులపల్లె ఆర్ఎస్ గ్రామంలో చెక్కభజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ చెక్కభజన కార్యక్రమంలో ఈశ్వర గౌడ్ పాల్గొని గురువు దగ్గర చేరి చెక్క భజన నేర్చుకున్నారు. ఇలా సాగుతున్న అతను గురువుగా తన సొంత గ్రామం గుండంపాడు లో గురువుగా చెక్కభజన బృందం నేర్పించారు చెక్కభజనతోపాటు జడకోపు, కోలాటం, ఇలా అనేక గ్రామాలలో ప్రదర్శనలు ఇచ్చారు సుమారు 120 గ్రామాలలో 450 చెక్కభజన కార్యక్రమంలో నిర్వహించారు అతను మాట్లాడుతూ ఈ అవార్డు నాకు రావడం ఎంతగానో సంతోషంగా ఉందని నేను ఇంత స్థాయిలో ఉండటం ఈఅవార్డు పొందిన అంటే మా గురువు కి జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటానని తెలిపారు. లలిత కళాభిరామ అవార్డు అధ్యక్షులు గొల్లపల్లి జయన్న కి ప్రత్యేకమైనటువంటి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చెక్క భజన కళాకారులు గురువు బొజ్జయ్య, తిరుపతి జిల్లా చెక్కభజన గురువు వెంకటసుబ్బయ్య, జానపద కళాకారులు సాలయ్య, నాగేష్ , ప్రసాద్ గుండంపాడు గ్రామ పెద్దలు బంధుమిత్ర ప్రజలందరూ కూడా ఆనందం వ్యక్తం చేశారు.

# మహానందిలో ఘనంగా 16 రోజుల పండుగ..







**మహానంది, మార్చి 2,(రిపబ్లిక్ న్యూస్)**
మహానంది క్షేత్రంలో 16 రోజుల పర్వదినాన్ని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు ఘనంగా నిర్వహించారు. మహానంది మహాశివరాత్రి పర్వదినం పూర్తయిన తర్వాత క్షేత్రంలో 16 పర్వదినం జరపడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సోమవారం ప్రధాన ఆలయాల్లో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథశాల వద్దకు మేళతాళాలతో చేరుకొని భక్ష్యాలను నివేదనగా సమర్పించారు. రథాన్ని రథశాల మండపంలోకి లాగారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా అంకురార్పణ కార్యక్రమంలో నాటిన విత్తనాలు మెలకలు వచ్చాయి. నీటిని ఆలయం ప్రాంగణంలోని రుద్రగుండం కోనేరులో కలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎర్రమల మధు, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# బనగానపల్లె ఆర్డిఓ ను కలిసిన మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కేడం సుబ్బరాయుడు .



**బనగానపల్లె, ప్రతినిధి,మార్చి 02 ,(ప్రజారిపబ్లిక్ న్యూస్)** పట్టణంలోని స్థానిక ఆర్డీవో కార్యాలయం నందు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో వై నరేంద్రనాథ్ కుమార్ రెడ్డి ని సోమవారం మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కేడం సుబ్బరాయుడు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కేడం విశ్వనాథ్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేడం సుబ్బరాయుడు మాట్లాడుతూ గతంలో నియోజకవర్గంలో ఉన్న మండలాలు డోన్ పట్టణంలో ఆర్డీవో కార్యాలయం ఉండేది ఇప్పుడు బనగానపల్లె కు ఆర్డీవో కార్యాలయం రావడం నియోజకవర్గం లో వున్నా ప్రజలకు ఎంతో ఉపయోగమని తెలిపారు. ఆర్డిఓ ఆఫీసు పనిమీద పోవాలంటే దాదాపు 60 కిలోమీటర్ల మేరకు ప్రయాణం చేయవలసి వచ్చేదని ఒకరోజు అంతా టైం కేటాయించాల్సి వచ్చేదని తెలిపారు బనగానపల్లె రెగ్యులర్ ఆర్డీవోగా వచ్చిన వై నరేంద్రనాథ్ కుమార్ రెడ్డిని కలవడం చాలా సంతోషమని ఆయన తెలిపారు. బనగానపల్లె నియోజకవర్గ ప్రజలకు రెవెన్యూ సమస్యలపై న్యాయబద్ధంగా ఉంటే విచారించి కుల మతము చూడకుండా న్యాయం చేయాలని ఆర్డీవోను కోరినట్లు తెలిపారు ఆర్డిఓ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

# అనాధాశ్రమానికి దుస్తులు వితరణ

**ఏ ఎస్ పి ఆర్ల శ్రీనివాసులు**

**స్వర్గీయ వినుకొండ మూర్తమ్మకు ఘన నివాళి**




**అనంతపురం రూరల్, మార్చి 02,(రిపబ్లిక్ న్యూస్):**ఆశ్రయ అనాధాశ్రమానికి తిరుపతి అడిషనల్ సూపరిండెంటెంట్ ఆఫ్ పోలీస్ ఆర్ల శ్రీనివాసులు దుస్తులు వితరణ చేశారు. సోమవారం కాటి గాని కాలువ గ్రామంలోని ఆశ్రయ అనాధాశ్రమంలో వారి అమ్మమ్మ స్వర్గీయ వినుకొండ మూర్తమ్మ గారి పదవ వర్ధంతి సందర్భంగా ఆశ్రమ వాసులకు అన్నదానంతో పాటు దుస్తులు వితరణ చేసి వారి అమ్మమ్మకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుండి అమ్మమ్మ ఎంతో కష్టపడి నన్ను ఇంత వాడిని చేసిందని, చిన్ననాటి జ్ఞాపకాలను ఆశ్రమ వాసులతో ఆయన పంచుకున్నారు. ఆమె నాలో దైవభక్తి కంటే మిన్నగా మానవత్వ విలువలు నేర్పిందని, ఆమె పేరుతో ఏమి ఇచ్చిన ఆమె రుణం తీర్చుకోలేమని ఆయనన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రయ అనాధాశ్రమం నిర్వాహకులు ఎర్రగుంట కృష్ణారెడ్డి ,తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు టివి రెడ్డి మాట్లాడుతూ ఆర్ల శ్రీనివాసులు సంఘవిద్రోహులకు సింహాస్వప్నం, కానీ సమస్యలతో వచ్చే ఫిర్యాదుదారుల బాధలు విన్న ఆయన మానవత్వంతో చలించే వారని, ఆయన చేపట్టే కార్యక్రమాలు నలుగురికి ఉపయోగపడే విధంగా తన అమృత హస్తాలతో అందిస్తారన్నారు. అందుకే ఆయన ఆశ్రమాలలో ఉన్న వారికి దుస్తులు అందజేసి సంతోషపడ్డారన్నారు. కార్యక్రమంలో ఆశ్రయ అనాధాశ్రమం నిర్వాహకులు దేవి కృష్ణారెడ్డి ,మధుసూదన్ రెడ్డి ,రాజశేఖర్ రెడ్డి ,లక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

# వెట్టి చాకిరి నుండి విముక్తి కల్పించాలి

**ఇంకా ఎంతకాలం బానిసత్వం**

**సీఐటీయూ కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్**



**అనంతపురం కార్పొరేషన్, మార్చి 02,(రిపబ్లిక్ న్యూస్):**
వెట్టి చాకిరి నుండి విముక్తి కల్పించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఏపీఎస్ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అనంతపురం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, ఆన్‌కాల్ డ్రైవర్లు, అద్దె బస్సు డ్రైవర్లు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి, వారి న్యాయమైన హక్కుల కోసం పోరాటాన్ని మరింత బలపరచాలని నిర్ణయించారు.

**రెగ్యులర్ చేయకపోవడం వంటి సమస్యలు అధికం**

ఈ సందర్భంగా సంవత్సరాల తరబడి ఒకే విధమైన పనిని నిర్వర్తిస్తున్నప్పటికీ కనీస భద్రత, స్థిరత్వం, సముచిత వేతనం, లేబర్ చట్టాల ప్రకారం లభించాల్సిన హక్కులు అందకుండా కార్మికులను కొనసాగించడం తీవ్ర అన్యాయం అని యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయకపోవడం, సమయానికి జీతభత్యాలు చెల్లించకపోవడం, వీక్లీ ఆఫ్‌లు, సెలవులు ఇవ్వకపోవడం, సంవత్సరాలుగా పనిచేస్తున్నప్పటికీ రెగ్యులర్ చేయకపోవడం వంటి సమస్యలు కార్మికులను తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. డ్రైవర్లపై వచ్చే ఫిర్యాదులను సరైన విచారణ లేకుండా చర్యలు తీసుకోవడం అన్యాయమని తెలిపారు.

**ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి**

ప్రస్తుతం అనంతపురం జిల్లాలో సుమారు 300 మంది ఔట్సోర్సింగ్ కార్మికులు, మరో 200 మంది ఆన్‌కాల్ అద్దె బస్సు డ్రైవర్లు ఏపీఎస్ఆర్టీసీలో సేవలందిస్తున్నారు. సంస్థ అభివృద్ధికి కీలకంగా పనిచేస్తున్న ఈ కార్మికులకు కనీస భద్రత లేకపోవడం, రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన వేతన విధానం లేకపోవడం ఆందోళన కలిగించే విషయం అని సీఐటీయూ పేర్కొంది.ఎన్ని సంవత్సరాలు పనిచేసినా స్థిరత్వం లేకుండా కొనసాగించడం అంటే అది వెట్టి చాకిరే అవుతుందని మండి పడ్డారు. ఇంకా ఎంతకాలం ఈ బానిసత్వం కొనసాగించాలని సీఐటీయూ ప్రశ్నిస్తోందన్నారు.ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని యూనియన్ తీవ్రంగా హెచ్చరించింది.ఈ సమావేశంలో సీఐటీయూ నగర కార్యదర్శి ముత్తుజ, జిల్లా కార్యదర్శి ఎం. రామాంజనేయులు, ఏపీఎస్ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ డి. అనిల్ కుమార్, నాయకులు కే. మధు, శివ, గౌస్ పీరా, బి. అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# పాములపాడు మండల విద్యుత్ అధికారులకు నిర్లక్ష్యం తగదు

**:- డీవీఎంసీ మెంబర్ లింగాల నాగరాజు**





**పాములపాడు ఫిబ్రవరి 21 రిపబ్లిక్ న్యూస్:-**
పాములపాడు మండల విద్యుత్ అధికారులకు నిర్లక్ష్యం తగదని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు ఆరోపించారు ఈ సందర్భంగా డివిఎంసి మెంబర్ లింగాల.నాగరాజు మాట్లాడుతూ పాములపాడు మండల కేంద్రంలో బస్టాండు ఆవరణలో మిట్టకందాలకు వెళ్లే టర్నింగ్ దగ్గర నిరుపయోగంగా ఉన్న పాత ఇనుప స్తంభాన్ని తీసివేసి, బడి పిల్లల బస్సులకు, భారీ వాహనాలకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు. ఈ సమస్యలపై ఎన్నోసార్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రాలు సమర్పించిన విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కర్నూలు అదే మాదిరిగా ఆత్మకూరు నుండి వచ్చే వాడాల, మద్దూరు, నంద్యాల బడి పిల్లల బస్సులకు టర్నింగ్లో ఈ విద్యుత్ స్తంభం వలన ఇబ్బంది గుర్తై, ట్రాఫిక్ కూడా సమస్యగా మారి, ఎన్నోసార్లు ప్రమాదాలు జరిగిన విద్యుత్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామాలలో రోడ్ల వెంట, పొలాలలో భూమికి నేల వాలుతున్న స్తంభాలను తొలగించకపోవడం వల్ల ప్రమాదాలకు గురై చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు వెంటనే మండల విద్యుత్ అధికారులు అప్రమత్తమై నేల వాలిన స్తంభాలను తీసివేసి, కొత్త స్తంభాలు వేయాలని ఆయన కోరారు. లేదంటే జిల్లా విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేస్తారని ఆయన హెచ్చరించారు.

# ప్రజా ఫిర్యాదులపై త్వరిత విచారణ

## బాధితులకు న్యాయం చేస్తాం: ఎస్పీ విక్రాంత్ పాటిల్

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 103 వినతులు - అధికారులకు తక్షణ చర్యల ఆదేశం





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 2)**
ప్రజా ఫిర్యాదులపై చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ హామీ ఇచ్చారు.
కర్నూలు కొత్తపేటలోని కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా వినిపించి, సంబంధిత పోలీసు అధికారులను వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు.
ఈ కార్యక్రమానికి మొత్తం 103 ఫిర్యాదులు అందాయి.
ప్రధాన ఫిర్యాదులు ఇలా ఉన్నాయి:
- నంద్యాల జిల్లా పాములపాడు మండలం జూటూరు గ్రామానికి చెందిన ఉమాదేవి తన కుమారుడికి హైదరాబాద్లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశారని ఫిర్యాదు.
- కర్నూలు ఎన్ఆర్పేటకు చెందిన రామకృష్ణ కుదువ పెట్టిన బంగారం డబ్బులు ఇచ్చినా తిరిగి ఇవ్వడం లేదని వినతి.
- కప్పల్నగర్కు చెందిన శాంతకుమారి భర్త మృతి తర్వాత అత్త ఆస్తి ఇవ్వడం లేదని న్యాయం కోరుతూ ఫిర్యాదు.
- ఆదోని చెందిన జయంతి తన కుమారుడు శశాంక్కు మార్కెటింగ్ ఉద్యోగం పేరుతో రూ.1 లక్ష మోసం చేశారని ఆరోపణ.
- తాండ్రపాడు గ్రామానికి చెందిన ఎస్ఆర్జి హౌసింగ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్ రామాంజనేయులు రూ.40 లక్షల లోన్ తీసుకుని కంతులు చెల్లించడం లేదని ఫిర్యాదు.
- సి.బెళగల్ మండలం కోండాపురం గ్రామానికి చెందిన తెలుగు చిన్న తిమ్మప్ప కుటుంబ సభ్యులు ఇంటి నుంచి పంపించారని వినతి.
- గార్గేయపురానికి చెందిన జార్జ్ ఆర్అండ్బి ఉద్యోగం పేరుతో రూ.1.30 లక్షలు మోసం చేశారని ఫిర్యాదు.

వచ్చిన అన్ని ఫిర్యాదులపై చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు డీఎస్పీ జె. బాబు ప్రసాద్తో పాటు సీఐలు రామకృష్ణ, శ్రీనివాస నాయక్, రమేష్, మస్తాన్ వలి పాల్గొన్నారు.

# హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

**హత్యాయత్నానికి 3 సంవత్సరాల జైలు ‹ కీలకంగా వ్యవహరించిన పోలీసులను ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందన**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 2)**
హత్య కేసులో నిందితుడు దగ్గుపాటి రాజుకు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి కబర్ధి జీవితకాల జైలు శిక్ష విధించారు. హత్యాయత్నం కేసులో అదనంగా 3 సంవత్సరాల జైలు శిక్షను కూడా ఖరారు చేస్తూ ఈరోజు తీర్పు వెలువరించారు. ఈ కేసులో కీలకంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ అభినందించారు.
ఫిర్యాదుదారు వడ్డి పాటి పుష్పరాణి (షరీఫ్ నగర్, కర్నూలు) భర్త వడ్డి పాటి వెంకటేశ్వర్లు (తండ్రి: వి. రామస్వామి, కల్లూరు మండలం) ఈ ఘటనలో హతుడయ్యాడు. నిందితుడు దగ్గుపాటి రాజు (తండ్రి: డి. చిన్నస్వామి, ఇందిరేశ్వరం గ్రామం, ఆత్మకూరు మండలం, నంద్యాల జిల్లా) తన భార్య వివాహేతర సంబంధంతో వెళ్లిపోయిందనే అనుమానం ఫిర్యాది కుటుంబంపై పెట్టుకున్నాడు. అదేవిధంగా హతుడు తన పొలం అమ్మిన డబ్బులో రూ.2 లక్షలు ఇవ్వలేదనే కారణంతో కక్ష పెంచుకున్నాడు.
ఈ క్రమంలో 2021 ఫిబ్రవరిలో కర్నూలు నగరంలోని షరీఫ్ నగర్లో ఉన్న హతుడి ఇంటి వద్దకు వెళ్లిన నిందితుడు గొడవకు దిగాడు. ఆవేశంలో వెంకటేశ్వర్లుపై కత్తితో దాడి చేయగా అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అడ్డుకొచ్చిన ఫిర్యాదుదారు పుష్పరాణిపై కూడా హత్యాయత్నం చేశాడు.
ఈ ఘటనపై కర్నూలు 4వ పట్టణ పోలీస్ స్టేషన్లో హత్య, హత్యాయత్నం కేసులు నమోదు అయ్యాయి. అప్పటి దర్యాప్తు అధికారి శ్రీనివాస్ రెడ్డి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్కు పంపి, దర్యాప్తు పూర్తి చేసి ఛార్జ్ షీట్ దాఖలు చేశారు.
ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కేసును నిరంతరం మానిటర్ చేయడంతో పాటు, ప్రస్తుత కర్నూలు 4వ పట్టణ సీఐ విక్రమసింహ, సెషన్స్ కోర్టు కానిస్టేబుళ్లు వెంకటరమణ, ఈశ్వర్ సాక్ష్యాలను సమయానికి ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రంగా రవి వాదనలు వినిపించగా, కోర్టు సాక్ష్యాధారాలను పరిశీలించి నేరం రుజువైనట్లు తేల్చింది.
దీంతో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ కోర్టు తీర్పు ప్రకటించింది.

# హోం గార్డ్స్‌కు వెల్ఫేర్ ఫండ్ చెక్కుల పంపిణీ

**ఏడు మందికి రూ.60 వేల ఆర్థిక సహాయం హోంగార్డు కమాండెంట్ ఎం. మహేష్ కుమార్ చేతుల మీదుగా అందజేత**





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 2)**కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో హోం గార్డ్స్ సెంట్రల్ వెల్ఫేర్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను సోమవారం హోంగార్డు కమాండెంట్ ఎం. మహేష్ కుమార్ హోం గార్డులకు అందజేశారు. ఈ కార్యక్రమం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు నిర్వహించారు.మొత్తం రూ.60 వేల విలువైన చెక్కులను ఏడు మంది హోం గార్డ్స్‌కు పంపిణీ చేశారు. ఇందులో ఇద్దరికి మ్యారేజ్ గ్రాంట్ కింద ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున, మరో ఐదుగురికి మెడికల్ గ్రాంట్ కింద ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున అందజేశారు.ఈ కార్యక్రమంలో హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ శ్రీమతి కె. మాధవి రాణి, పోలీసు సిబ్బంది మరియు హోం గార్డ్స్ పాల్గొన్నారు.

# ఉల్లాస్ కార్యక్రమంతో వయోజన విద్యకు కొత్త ఊపు

**అక్షరాస్యత పెంపే లక్ష్యం నిరక్షరాస్యుల గుర్తింపుకు ప్రత్యేక చర్యలు కమిషనర్ పి. విశ్వనాథ్**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 2)**వయోజన విద్య అభివృద్ధికి 'ఉల్లాస్' కార్యక్రమం ముఖ్య పాత్ర పోషిస్తోందని, సమాజంలో సంపూర్ణ అక్షరాస్యత సాధనమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ తెలిపారు. సోమవారం స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ఉల్లాస్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానం2020లో భాగంగా 'ఉల్లాస్' పేరుతో నవభారత సాక్షరత కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. గతంలో అమలులో ఉన్న సాక్షర భారత్ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ రాష్ట్రంలో 'ఉల్లాస్ అక్షరఆంధ్ర' పేరుతో అమలు చేస్తున్నట్లు తెలిపారు.15 ఏళ్లకు పైబడిన వయోజనుల్లో, ముఖ్యంగా మహిళల్లో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి వారికి అక్షరజ్ఞానం కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. అలాగే మధ్యలో చదువు మానేసిన విద్యార్థులను తిరిగి ఓపెన్ పది, ఇంటర్ తరగతుల్లో చేర్పించే చర్యలు కూడా చేపడుతున్నామని వివరించారు. ఈ ప్రక్రియను సులభతరం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిఎంఎం సుధాకర్, ఎస్ఈ రమణమూర్తి, ఎమ్ఈ మనోహర్ రెడ్డి, డిసిపి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.ది

# గుడిబండలో ఉపాధి శ్రామికులకు అదనపు పనిదినాలు

**గుడిబండ, మార్చి 2 (రిపబ్లిక్ న్యూస్):**
గుడిబండ మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో, జీరామ్ జీ పథకం కింద ఉపాధి శ్రామికులకు అదనంగా 50 పనిదినాలు కల్పించనున్నట్లు ఏపిఓ జగదీష్ వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ, "మండలంలోని శ్రామికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధి శ్రామికులు అడిగిన వెంటనే జీరామ్ జీ సిబ్బంది పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటారు" అని తెలిపారు. **నేపథ్యం:** కరువు పరిస్థితుల కారణంగా గుడిబండ మండలంలో రైతులు, కూలీలు ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన అదనపు పనిదినాలు గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించనున్నాయి.



**ప్రభావం:**శ్రామికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.కుటుంబాల జీవనోపాధి కొనసాగించడానికి ఇది ఒక సహాయక చర్యగా మారుతుంది. స్థానిక ఆర్థిక వ్యవస్థలో కొంత స్థిరత్వం ఏర్పడే అవకాశం ఉంది.

# ప్రజల నాయకుడు ప్రజల సమస్యలే తన సమస్యగా ముందుండే మా నాయకుడు కాంగ్రెస్ పార్టీ చౌటాకుర్ మండల అధ్యక్షులు నత్తి దశరథ్ జన్మదిన వేడుకలు







**ఆందోల్ నియోజకవర్గం**
**ప్రతినిధి మార్చి 2 ( రిపబ్లిక్ న్యూస్ )**
చౌటాకుర్ మండల్ శివంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ చౌటాకుర్ మండల అధ్యక్షులునత్తి దశరథ్ తన సన్నిహితుల మధ్యలో పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకోవడం జరిగింది ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ కాశ పాగ ఇమ్మయ్య మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వం అమలుపరుస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలలో తన ఒత్తుగా ప్రతి ఒక్క కార్యక్రమంలో సోదర భావంతో అందరిని కలుపుకొని పోయే తత్వం గల వ్యక్తి పార్టీలకు అతీతంగా స్నేహ సంబంధాల మధ్యలో అందర్నీ కలుపుకు పోయే స్వభావం ఉన్న నాయకుడు ఎవరికి ఆపదొచ్చిన నేనున్నానంటూ ధైర్యాన్ని తనకు తోచిన సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు నడుస్తున్న తన పుట్టినరోజు జరుపుకోవడం చాలా సంతోషంగా భావిస్తూ లా మరి ఇంకెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని మరి ఇంకెన్నో పదవులు ఉన్నతమైన స్థానంలో ఉండాలని కోరుకున్నారు

# ప్రజలకు సేవలు సులభంగా అందాలి: కమిషనర్ పి. విశ్వనాథ్

**ప్రజా ఫిర్యాదుల వేదికలో 19 అర్జీలు స్వీకరణ సమస్యలపై తక్షణ చర్యలకు ఆదేశాలు**





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 2)**
నగరపాలక సేవలు ప్రజలకు సులభంగా అందేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ సూచించారు. సోమవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.వివిధ కాలనీలకు చెందిన ప్రజల నుండి మొత్తం 19 ఫిర్యాదులను కమిషనర్ స్వీకరించారు. అందిన సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్ బాబు, కార్యదర్శి నాగరాజు, ఎంఈ మనోహర్ రెడ్డి, మెప్మా పీడీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.వచ్చిన విన్నపాల్లో కొన్నిసుంకేసుల రోడ్డులోని వసంత రెసిడెన్సీ వద్ద ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని ముంతాజ్ బేగం, మాధవిలత ఫిర్యాదు చేశారు.శ్రీనగర్‌లో డ్రైనేజీ కాలువ నిర్మించాలని రయోషా జబిన్, రాధికా తదితరులు కోరారు.మహావీర్ నగర్‌లో డ్రైనేజీ కాలువను పొడిగించాలని శేషిరెడ్డి, శంకరయ్య విన్నవించారు.బృందావన్ నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని యు. వెంకటేశ్వర్లు కోరారు.సుద్దవాగులో పేరుకుపోయిన పూడిక వ్యర్థాలను తొలగించాలని శేఖర్, రేణుక, సోమయ్య తదితరులు విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను
# పెండింగ్ ఉంచకుండా పరిష్కరించాలి





## .. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

**ఏపీ బ్యూరో, మార్చి 01 - (రిపబ్లిక్ న్యూస్) -**
మదనపల్లి :- జిల్లా కలెక్టరేట్ సముదాయంలోని కోర్టు హాల్లో సోమవారం మదనపల్లి కేంద్రంగా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్వయంగా పాల్గొని అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు, మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లాకళ్యాణి, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఏడి సర్వే భరత్ కుమార్, జి ఎస్ డబ్ల్యూ ఎస్ లక్ష్మీపతి ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను పెండింగ్ ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పిజిఆర్ఎస్ అర్జీలకు సంబంధించి ఉన్నతాధికారులతో సమీక్ష చేస్తున్నారన్నారు. జిల్లా అధికారులు అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, ఆయా శాఖల పరిధిలో పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ పై ఆడిట్ నిర్వహించాలన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడాలని, పెండింగ్ ఆడిట్ పూర్తి చేయాలన్నారు. జిల్లా అధికారులు వారి పరిధిలో ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన మండలాలను, గ్రామాలను పర్యటించి అక్కడి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. జిల్లాలోని ఆయా శాఖల అధికారులు వారికి కేటాయించిన లక్ష్యాలను చేరుకునే విధంగా అధికారులు క్రమశిక్షణతో పని చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల నుండి 285 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు.

**ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు..**
కురబలకోట మండల కేంద్రమైన అంగళ్లు గ్రామ పంచాయతీ పరిధిలోని పోరెడ్డి వారి పల్లి కు చెందిన కూట గొల్ల హసీనాబీ కలెక్టర్ కు విన్నవిస్తూ తమ వ్యవసాయ భూమి కలదని అందులో కరెంట్ ట్రాన్స్ ఫార్మర్ కొరకు మూడేళ్ల కిందట 29వ తారీఖు 9వ నెల 2023లో రూ.18,650 సౌత్ పవర్ డిస్ట్రిబ్యూషన్ వారికి చెల్లించడం జరిగిందని ఇంతవరకు విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్ ఫార్మర్ మంజూరు చేయలేదు. మీరు పరిశీలించి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ మంజూరు చేసే విధంగా తమరు న్యాయం చేయాలని జిల్లా విన్నవించుకున్నారు. సదుం మండల కేంద్రమైన కంబమవారిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పిడిగోవలవారిపల్లి గ్రామానికి చెందిన ఏ. మంజుల తనకు మెదడు వాపు వ్యాధి సోకి కుడి చేయి, మాట్లాడడానికి కూడా వీలు కావడం లేదని మంచానికే పరిమితమయ్యానని ఇప్పుడు రూ. 6000 పెన్షన్ వస్తున్నదని, నాకు 85 శాతం వికలాంగత్వం తో సదరన్ సర్టిఫికెట్ మంజూరు చేయడం జరిగిందని వికలాంగ పెన్షన్ మంజూరు చేయవలసిం దిగా జిల్లా కలెక్టర్ ను కోరారు. రాయచోటి మండల కేంద్రమైన రామాపురం చెందిన బి. కృష్ణమ్మ నాకు నా భర్తకు ఆరోగ్యం సరిగా లేదని, మాకు పిల్లలు కూడా లేరని, నాకు ఎటువంటి జీవనాధారం, భూములు లేవని, కుటుంబ పోషణ కష్టంగా ఉందని వయసు మీద పడటం వలన ఏ పనులను చేయలేక పోతున్నామని ప్రభుత్వం నుండి మాకు వృద్ధాప్య పెన్షన్ ను మంజూరు చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ కు విన్నవించారు. కలెక్టర్ ను కలిసిన బాధితులకు తక్షణమే వాళ్ల సమస్యలను పరిష్కారం చేయాలని సంబంధిత శాఖాదికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున అర్జీదారులు విచ్చేసి తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ ను కలిసి తమ గోడును వివరిస్తూ వివిధ రకాల అర్జీలను సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# చిరుధాన్యాలతోనే ఆరోగ్య సిరి

**-మిల్లెట్ మ్యాన్ అఫ్ ఇండియా ఖాదర్ వలీ --నంద్యాలలో 'శ్రీ అన్న మిల్లెట్ క్విక్ సర్వీసెస్' రెస్టారెంట్ ప్రారంభం**





**నంద్యాల ఫిబ్రవరి 2 (రిపబ్లిక్ న్యూస్) :**
చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని 'మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా' డాక్టర్ ఖాదర్ వలీ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఏర్పాటు చేసిన 'శ్రీ అన్న మిల్లెట్ క్విక్ సర్వీసెస్ ' రెస్టారెంట్‌ను మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎస్బీఐ రీజినల్ మేనేజర్ సూర్యప్రకాష్, నిర్వాహకులు కె. రామసుబ్బారెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాదర్ వలీ మాట్లాడుతూ.. పూర్వీకులు వాడిన చిరుధాన్యాలను విస్మరించడం వల్లే నేడు అనేక రోగాలు, వైరస్‌లు మానవ శరీరంపై సులువుగా దాడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొర్రలు, సామలు, అండుకొర్రలు, ఊదలు, అరికెలు.. ఈ ఐదింటిలో అద్భుతమైన ఔషధ గుణాలు ఉన్నాయని వివరించారు. చిరుధాన్యాల వాడకంతో వీటిలో ఉండే పోషకాలు శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయని, రక్తంలోని చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరించడంలో చిరుధాన్యాలు మేటిగా పనిచేస్తాయని, వీటిలో పీచు (ఫైబర్) అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి, మలబద్ధకం వంటి సమస్యలు దరిచేరవన్నారు . ఊబకాయంతో బాధపడేవారు చిరుధాన్యాలను తీసుకుంటే సులభంగా బరువు తగ్గవచ్చని, వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయన్నారు మన జీవనశైలిలో చిరుధాన్యాలను భాగం చేసుకుంటే సగం జబ్బులను నియంత్రించవచ్చని ఖాదర్ వలీ సూచించారు. అనంతరం స్థానికులు అడిగిన పలు ఆరోగ్య సమస్యలకు, సందేహాలకు ఆయన సమాధానాలిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ఆహార ప్రియులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల్లో
# ప్రజల సానుకూలత పెంపొందించాలి

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





**నంద్యాల, బ్యూరో మార్చి 02( రిపబ్లిక్ న్యూస్)**
ప్రభుత్వం చేపట్టిన ప్రాధాన్యత పథకాల అమలులో జిల్లాలో సానుకూలత శాతాన్ని పెంపొందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ఫిర్యాదు దారుల నుండి అర్జీలు స్వీకరించిన అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్ఓ రామునాయక్ అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత పథకాల అమలులో జిల్లాలో ప్రజల సానుకూలత శాతాన్ని పెంచే దిశలో చురుకుగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యం, భద్రత, మౌలిక వసతుల విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది చేసిన తప్పులకు జిల్లా స్థాయి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టమైన సంకేతాలు ఇచ్చిందని కలెక్టర్ పేర్కొన్నారు. "కింది స్థాయి సిబ్బంది చూసుకోలేదు" అని చెప్పి బాధ్యత నుంచి తప్పించుకునే అవకాశం లేదని స్పష్టం చేశారు. ప్రతి జిల్లా అధికారి తన శాఖ పనితీరును సమగ్రంగా పర్యవేక్షించాల్సిన బాధ్యత కలిగి వుండాలని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, కాలుష్య నియంత్రణ తదితర శాఖలకు కలిగిన రెగ్యులేటరీ అధికారాలను సమర్థంగా వినియోగించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించే సంస్థలకు కేవలం నోటీసులు ఇవ్వడం సరిపోదని, అవసరమైతే సీజ్ వంటి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆళ్లగడ్డలో నిబంధనలు పాటించని ఒక ఆర్‌ఓ ప్లాంట్‌ను సీజ్ చేయడంతో పరిస్థితుల్లో మార్పు వచ్చినట్లు ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రజారోగ్య సమస్యలు ఉద్భవించే పరిస్థితుల్లో అధికారుల చర్యలు మరింత దృఢంగా ఉండాలని స్పష్టం చేశారు. ఫైర్ ఎన్‌ఓసీ జారీ విషయంలో 100 శాతం పనితీరు ఉండాలని, ఎక్కడ పరిపాలనా లోపం ఉందో గుర్తించి సరిదిద్దుకోవాలని సూచించారు. జిల్లాలోని శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, 20 శాతానికి పైగా నెగిటివిటీ ఉన్న శాఖల అధికారులు తక్షణమే కారణాలు వివరించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా ట్రాన్స్‌పోర్ట్ శాఖలో 41.7% నెగిటివిటీ నమోదైందని, వాహన్ సేవలపై సుమారు 40% ప్రతికూల అభిప్రాయం ఉందని తెలిపారు. యూరియా లభ్యతలో 38.4%, హౌసింగ్ విభాగంలో 33% నెగిటివిటీ ఉండడం ఆందోళనకరమని పేర్కొన్నారు. మైనారిటీ వెల్ఫేర్ శాఖలో 33.2% నెగిటివిటీ ఉండగా, త్రాగునీరు, వీధి దీపాల వంటి మున్సిపల్ సేవల్లో 22% నెగిటివిటీ నమోదవడం గమనార్హమని, వేసవి కాలం దృష్ట్యా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో (జీజీహెచ్) 24 శాతం నెగిటివిటీ ఉండడంపై కూడా సమీక్షించాలని పేర్కొన్నారు. వెల్ఫేర్ హాస్టళ్లలో డేటాబేస్ ప్యూరిఫికేషన్ అత్యవసరమని, పాత డేటాను తొలగించి ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల వివరాలు, తల్లిదండ్రుల మొబైల్ నంబర్లను అప్‌డేట్ చేయాలని సూచించారు. డేటా సరిచేసిన తర్వాతే పనితీరు మెరుగుపడుతుందని తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలు దిగువ స్థాయి నుంచి రెండో స్థానానికి రావడం ప్రశంసనీయం అని అభినందించారు. మైనారిటీ వెల్ఫేర్ శాఖ డేటా ప్యూరిఫికేషన్ తర్వాత మెరుగైన స్థానానికి చేరుకుందని పేర్కొన్నారు. సెర్ప్ జిల్లా స్థాయిలో టాప్ పర్ఫార్మింగ్ శాఖగా నిలవడం సంతోషకరమని తెలిపారు. 70 శాతం పైగా సానుకూలత సాధించిన శాఖలను ఆదర్శంగా తీసుకొని, 30% లోపు పనితీరు ఉన్న శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మొహమాటం వల్ల విధుల్లో వెనుకడుగు వేయరాదని, ప్రజా ప్రయోజనాల విషయంలో రాజీ ఉండకూడదని అవసరమైతే కఠిన చర్యలు తీసుకోవడంలో వెనుకాడవద్దు" అని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

# జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్ పై అవగాహన సదస్సు





**గుత్తి మార్చి 02 (రిపబ్లిక్ న్యూస్)**
గుత్తి పట్టణం ఆర్ఎస్ రోడ్ ఉన్నటువంటి శ్రీ సాయి క్యాంపస్ సీఈవో ఏ. శ్రీరాములు, పి ఆర్ ఆర్ ఎం బి ఏ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసన్న కుమార్ , శ్రీ సాయి డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ పి రంగస్వామి రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్ పై అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనంతపురం జిల్లా నోడల్ అధికారి టి. వెంకటేష్ నాయక్ హాజరై సమయపాలనతో కూడిన చెత్త సేకరణ వ్యవస్థను అమలు చేసి, తడి చెత్త మరియు పొడి చెత్తను వేరు చేసి ప్రత్యేక బిన్లలో వేయాలని పిలుపునివ్వడం జరిగినది అదేవిధంగాప్రజలు రోడ్లపై మరియు బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయకూడదని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని, చెత్తను కాల్చకూడదని సూచించారు. చెత్త వేయడం, ఉమ్మివేయడం మరియు అక్రమంగా చెత్త పడేయడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, చంద్రశేఖర్,రజిని, మస్తాన్,ఆఫ్రిన్ తాజ్ , రేష్మ ,షాను, కౌసర్, సంధ్య, అరుణ్, నిజాముద్దీన్ మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనడం జరిగినది.

# మెలవాయి గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం - ప్రజల్లో ఆనందం



**మడకశిర, మార్చి 2: (రిపబ్లిక్ న్యూస్)** మడకశిర నియోజకవర్గంలోని మెలవాయి గ్రామం గత కొంతకాలంగా తీవ్రమైన తాగునీటి సమస్యతో సతమతమవుతోంది. వేసవి కాలం దగ్గరపడుతుండటంతో సమస్య మరింత తీవ్రమైంది. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజల ఆవేదనను గమనించిన మడకశిర శాసన సభ్యులు ఎం.ఎస్. రాజు, మాజీ శాసన మండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి ముందడుగు వేసి తక్షణ చర్యలు చేపట్టారు. గ్రామంలో కొత్త బోరు త్రవ్వించి, మోటారు పంపు సెట్ అమర్చించి, పైప్‌లైన్ వేసి తాగునీటి సరఫరా ప్రారంభించారు. ఈ చర్యలతో గ్రామ ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కుంచిటిగ వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మి నారాయణ, మాజీ సర్పంచ్ నారాయణ గౌడ్, ప్రస్తుత సర్పంచ్ రంగనాధ్, బీజేపీ నాయకులు రాందాస్ రావు, తెలుగు దేశం పార్టీ నాయకులు పాల్గొని శాసన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై హర్షం వ్యక్తం చేశారు.గ్రామస్తులు మాట్లాడుతూ, "ఇంతకాలం తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం.ఇప్పుడు కొత్త బోరు, పైప్‌లైన్ ఏర్పాటుతో సమస్య పూర్తిగా పరిష్కారమైంది. మా కష్టాలను గుర్తించి చర్యలు తీసుకున్న నాయకులకు కృతజ్ఞతలు" అని తెలిపారు. మెలవాయి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం ప్రజల హర్షధ్వానాలతో ముగిసిన కార్యక్రమం.

# సారా విక్రయదార కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపండి

**నాటు సారా వల్ల కలిగే అనర్థాలను తెలియజేయండి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




**నంద్యాల, బ్యూరో మార్చి, 02 (రిపబ్లిక్ న్యూస్):**
నాటు సార విక్రయదార కుటుంబాల జీవనోపాధికి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా నాటుసార కుటుంబాల పునరావాస వ్యూహం మరియు కార్యాచరణ ప్రణాళికపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో నంద్యాల డిఎస్పీ మంద జావలి అల్ఫోన్స్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, మెప్మా పిడి వెంకట దాసు, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాటు సారా విక్రయదార కుటుంబాలను పునరావాసం కల్పనలో భాగంగా నవోదయం 2.0 కార్యక్రమం వారి జీవనోపాధి కోసం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఏ కేటగిరీలో 19 గ్రామాలు, బి కేటగిరీలో 19 గ్రామాలు, సి కేటగిరిలో 91 గ్రామాలను జిల్లాలో నాటు సారాను పూర్తి స్థాయిలో నివారించడానికి 19 ఫిబ్రవరి 2025 నుండి సెప్టెంబరు 12వ తేది వరకు పకడ్బందీ ప్రణాళిక వారీగా నాటు సారా తయారీని పూర్తి స్థాయిలో తొలగించేలా చర్యలు తీసుకున్నామన్నారు. నాటు సార, కల్తీ నెయ్యి లాంటి ప్రాణాంతకమైన వాటిని చేయడం ద్వారా ప్రజా ఆరోగ్యం పట్ల చెలగాటం ఆడడం వల్లనే మీ మీద కేసులు నమోదవ్వడం జరుగుతోందన్నారు. అలాకాకుండా మీ అంతటా మీరు నాటు సార వదిలేసి ప్రత్యామ్నాయ ఉపాధి వైపు మారడానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 222 కుటుంబాలు జీవనోపాధి కల్పించమని కోరడం జరిగిందని, అందులో పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి అయిన విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఉపాధి కల్పిస్తామని, మహిళలకు చేతివృత్తులు, కుట్టు అల్లికలు, పేపర్ కప్స్, జ్యూట్ బ్యాగ్స్ తయారీ, మహిళలకు పొదుపు గ్రూపులుగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డిఆర్డిఎ, మెప్మా పిడిలను కలెక్టర్ ఆదేశించారు. పురుషులకు పశుపెంపకం, తేనటీగ పెంపకం లాంటి జీవనోపాధి మార్గాల దృష్టి సారించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే విధంగా సదురు కుటుంబాలకు సంబంధించిన పూర్తి స్థాయి వివరాలను అందజేయాలను ఎక్సైజ్ సూపరింటెండెంట్ ను కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు నాటు సార విక్రయదార కుటుంబాల జీవనోపాధికి కల్పించాల్సిన సదుపాయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.౦

# ఎమ్మెల్సీ అంజిరెడ్డిని కలిసిన భాజపా మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి.





**మల్లాపూర్ మార్చి 2 (రిపబ్లిక్ న్యూస్)**
ఈరోజు ఉమ్మడి కరీంనగర్, అదిలాబాద్, మెదక్, నిజామాబాదు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి చిన్నమల్లై ని హైదరాబాదులో వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి మల్లాపూర్ మండలంలోని అనారోగ్యానికి గురైన వారి సీఎం రిలీఫ్ ఫాండ్ దరఖాస్తులను ఈరోజు వారికి అందజేయడం జరిగింది. అలాగే గొర్రెపల్లి, గుండంపెల్లి, మరియు మొగిలిపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎమ్మెల్సీ నిధుల నుండి గదులు మరియు మరుగుదొడ్లు నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని వారిని కోరడం జరిగింది. దానికి వారు సానుకూలంగా స్పందించి తప్పకుండా చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

# విలువిద్యలో రాణించాలని విద్యార్థులకు పిలుపు

**జిల్లా స్థాయి పోటీల్లో నారాయణ స్కూల్ విద్యార్థులకు పతకాలు ప్రిన్సిపల్ శ్రీనివాస రెడ్డి అభినందనలు**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 2)**



విద్యార్థులు విలువిద్యలో ప్రతిభ కనబరచి ఉన్నత స్థాయికి చేరాలని నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస రెడ్డి సూచించారు. ఇటీవల కర్నూలు ఔట్ డోర్ స్టేడియం లో జిల్లా విలువిద్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి విలువిద్య పోటీల్లో నారాయణ స్కూల్ విద్యార్థులు విశిష్ట ప్రతిభ కనబరచారు. అండర్13 విభాగంలో తుంగని మమతశ్రీ సిల్వర్ మెడల్ సాధించగా, అండర్15 విభాగంలో తుంగని రూపాశ్రీ గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించిన శ్రీనివాస రెడ్డి, మార్చి 11 నుంచి 13 వరకు నూజివీడు లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. విలువిద్య ప్రాచీన క్రీడ అని, పూర్వం మానవులు వేట కోసం ఉపయోగించేవారని తెలిపారు. ఆధునిక కాలంలో ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై విలువిద్యకు విశేష ప్రాధాన్యం లభిస్తోందన్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి సురేఖ వెన్నం, బొమ్మదేవర ధీరజ్ ఒలింపిక్స్‌లో ప్రతిభ కనబరచి రాష్ట్రానికి పేరు తీసుకువచ్చారని గుర్తు చేశారు.
ఈ కార్యక్రమంలో నారాయణ స్కూల్ పీ.ఈ.టి, ఉమ్మడి కర్నూలు జిల్లా విలువిద్య సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల వేదికకు 72 ఫిర్యాదులు

## జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్--

**నంద్యాల క్రైమ్ మార్చి 02 - (రిపబ్లిక్ న్యూస్):**







నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఫిర్యాదుదారుల నుండి 72 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలతో ఎస్పీ స్వయంగా మాట్లాడి ప్రతి ఫిర్యాదుపై పూర్తిస్థాయి విచారణ జరిపి చట్ట పరిధిలో న్యాయం చేస్తామని తెలిపారు. చట్టబద్ధమైన సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని, నిర్ణీత గడువులో ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.

**ముఖ్య ఫిర్యాదులు**పాణ్యం మండలానికి చెందిన వెంకటసుబ్బయ్య తన 3.52 సెంట్ల వ్యవసాయ భూమి అమ్ముతామని చెప్పి ఆవుల రమేష్ నాయుడు 15 లక్షలు, హనుమంత 26 లక్షలు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా ఇతర వ్యక్తికి నమోదు చేసి మోసం చేశారని ఫిర్యాదు చేశారు. సంబంధితులపై చట్టరీత్యా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ముష్టపల్లె గ్రామానికి చెందిన ఆదినారాయణ తన పిల్లలకు యోగా టీచర్ ఉద్యోగం ఇప్పిస్తామని శివశేఖర్ అనే వ్యక్తి 5 లక్షల 30 వేల రూపాయలు తీసుకుని ఉద్యోగం కల్పించకుండా డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేశారు.
సలీంనగర్ కు చెందిన షేక్ షేర్ అలీ తాను వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నానని, షేక్ మొహమ్మద్ రఫీ మట్టి పోసి రహదారి మూసివేసి ఇబ్బందులు కలిగిస్తున్నాడని పేర్కొంటూ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు.


# బీఆర్ నాయుడు భయంకరమైన ఉమనైజర్..

## పశువుకంటే హీనం.. -భూమన కరుణాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు..

**ఏపీ బ్యూరో, మార్చి 02 - (రిపబ్లిక్ న్యూస్) -**






తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడుపై తిరుపతి మాజీ శాసనసభ్యులు, ఉమ్మడి జిల్లాల వైసీపీ అధ్యక్షుడు, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ నాయుడును అసలు మనిషిగా కూడా చూడనని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాజీనామా చేయమని అడిగే వాడినయితే నీ దగ్గరకు ఎందుకు వస్తాను రా పోరంబోకోడా అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇలా మాట్లాడుతున్నందుకు సమాజానికి క్షమాపణలు చెప్తున్నానని భూమన క్షమాపణ చెప్పారు. బీఆర్ నాయుడుపై తనకు ఎలాంటి వ్యక్తిగత ద్వేషం లేదని చెప్పుకొచ్చారు. అయితే ఆ పదవికి నువ్వు సరిపోవంటూ ఘాటు విమర్శలు చేశారు. అసలు బీఆర్ నాయుడు తన కాలిగోటికి కూడా సరిపోవని మండిపడ్డారు. బిఆర్ నాయుడు వీడియోలు, ఫొటోలు ఫ్యాక్ట్ చెక్ తర్వాతే తాము మాట్లాడుతున్నట్లు చెప్పుకొచ్చారు. మాపై అరేయ్ తురేయ్ అని మాట్లాడుతున్న బీఆర్ నాయుడును తాము కూడా రేయ్, లఫూట్, లవంగ్, చప్రాసీ అని అనగలమని కానీ మా నాయకుడు సంస్కారం నేర్పారని ఒక హోదాలో ఉన్న వ్యక్తిగా గౌరవిస్తామని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా =జూాజూూ×ూచీూఎ౯ూ ఔఊస్ట్ర దీ= చీూ×ణఖ అనే పేరుతో ఇందులేఖ ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడుకు గతంలో రాసిన లేఖను ఈ సందర్భంగా మీడియాకు విడుదల చేశారు.

**బాధితురాలు రాసిన లేఖను బయటపెట్టిన భూమన..**

'సోషల్ మీడియాలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు రాసలీలలు వెలుగులోకి వచ్చాయి. 30 ఏళ్ల అనుబంధం ఉందని బీఆర్ నాయుడు స్పష్టంగా చెప్పారు. ఏఐ టెక్నాలజీతో చేసిన విడియో కాదని నిపుణులు ఇచ్చిన రిపోర్ట్ ఇది. దుర్యోధనుడు కంటే అహంకారంతో బీఆర్ నాయుడు మాట్లాడుతున్నాడని టీటీడీ మాజీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆరోపించారు. 'మాజీ సీఎం జలగం వెంగళ రావు జుబ్బా పట్టుకుని కరపత్రం అందించిన చరిత్ర నాది. నీకు నేను భయపడతానానని అన్నారు. ఈ సందర్భంగా 2019 ఎన్నికలు సమయంలో చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్‌కు బాధితురాలు రాసిన లేఖను భూమన కరుణాకర్ రెడ్డి విడుదల చేశారు. రిలేషన్ షిప్ విత్ బి.ఆర్.నాయుడు అంటూ రాసిన లేఖను బయటపెట్టారు.

**బీఆర్ నాయుడు భయంకర ఉమనైజర్..**

'25 ఏళ్లుగా బిఆర్ నాయుడు పరిచయస్తుడని బాధితురాలు తన లేఖలో పేర్కొంది. సుఖం, సంతోషం లేకపోగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నా. బీఆర్ నాయుడు బాగా చూసుకుంటాను. ఇమ్యూన్ డిసీజ్‌తో నా కూతురు బాధపడుతున్నా పట్టించుకోలేదు. నన్ను కుక్క కంటే హీనంగా దుర్భాషాలడుతూ బాధపెట్టారని బాధితురాలు రాసిన లేఖను విడుదల చేశారు. '2016 నుంచి నాపై నిఘా పెట్టి, చంపేస్తానని బెదిరించారు. బీఆర్ నాయుడు భయంకర ఉమానైజర్(స్త్రీ లోలుడు). టీడీపీ అధికారంలోకి వస్తే రాజ్యసభ ఎంపీ, టీటీడీ చైర్మన్ పదవి అని బి.ఆర్.నాయుడు ప్రచారం చేస్తున్నారు. అత్యున్నత పదవి ఇస్తే స్త్రీలు ఇబ్బందులు పడతారు. బీఆర్ నాయుడు పశువు కంటే హీనమంటూ బాధితురాలు రాసిన లేఖను భూమన కరుణాకర్ రెడ్డి విడుదల చేశారు. వైదిక బ్రాహ్మణ తల్లి తనకు జరుగుతున్న అన్యాయంపై లేఖ రాస్తే చంద్రబాబు నాయుడు పట్టించుకోలేదని విమర్శించారు. ఇలాంటి విషయాల్లో తగ్గేది లేదంటున్నా బీఆర్ నాయుడు, నువ్వు ఎక్కడ తగ్గొద్దు. ఇలాంటి విషయాల్లో నువ్వు ముందుకు వెళ్లాలి. నీలాంటి వాళ్ళు ఈ పదవికి అర్హులు కాదనే నా బాధ. అక్రమాలతో, అన్యాయాలతో భూములు ఆక్రమించావని బీఆర్ నాయుడుపై భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు.

**బీఆర్ నాయుడు తన పదవికి రాజీనామా చేయాలి..**

2017 షిర్డీ ఎయిర్ పోర్ట్ ఓపెన్ చేశారు. ఈ మధ్య కాలంలో ఏక సభ్య కమీషన్ నియమించుకుని అయన సొంత విచారణ చేసుకుంటున్నాడు. చంద్రబాబు పాలనలో 2002 లక్ష్మయ్య అనే సీనియర్ అసిస్టెంట్ వివాహేతర సంబంధం పెట్టుకుంటే ఉద్యోగం తొలగించారు. బి.ఆర్.నాయుడు కాదు క్రిమి కంటుడని పేరు పెట్టుకోవాలని భూమన కరుణాకర్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. 'మిడ్ నైట్ మసాలా నాయుడు నువ్వు చేసింది స్వామి క్షేత్రంలో మసాలా వడ పెట్టించాడు. భగవద్గీతను పాలకమండలి పుస్తకం విసిరి పడేశాడు. శ్రీకృష్ణ భగవద్గీత ఛీ అంటూ బీఆర్ నాయుడు అవమానించారు. తక్షణమే బీఆర్ నాయుడు తన పదవికి రాజీనామా చేయాలని భూమన కరుణాకర్ రెడ్డి డిమాండ్ చేశారు.

**పక్కలోకి రాకపోతే ఏ చిన్నపని చేయడు.. లేఖలో బాధితురాలు..**

బీఆర్ నాయుడికి మహిళలను లోబర్చుకోవడమే పని. నాతో 30 ఏళ్లుగా సంబంధం పెట్టుకుని ఆర్థికంగా, మానసికంగా వేధిస్తున్నాడు. అనారోగ్యంతో ఉన్న నా కూతురు కోసం భరిస్తున్నాను. బీఆర్ నాయుడు లాంటి ఉమెనైజర్‌కు టీటీడీ చైర్మన్ పదవి మీకే నష్టం ఆలోచించుకోండి. బాధితురాలి తో బీఆర్ నాయుడు సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బీఆర్ నాయుడు భాగోతం మొత్తం తెలిసే పవిత్రమైన టీటీడీ చైర్మన్ పదవి ఇచ్చావా. బీఆర్ నాయుడు లాంటి నీచులకు ఆ పదవిలో ఉండే అర్హత లేదు. వెంటనే బీఆర్ కామ నాయుడు తన పదవికి రాజీనామా చేయాలని భూమన కరుణాకర్ రెడ్డి డిమాండ్ చేశారు..

# రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడిగా సుగవాసి ప్రసాద్ బాబు ప్రమాణ స్వీకారం..

- హోరున నినాదాలతో దద్దరిల్లిన సభా ప్రాంగణం..
- కార్యకర్తల రాకతో జనసంద్రమైన మదనపల్లె..!
- కార్యకర్తలే నా బలం..మీ నమ్మకమే నా ఊపిరి..!
- స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయఢంకా మోగిస్తాం..

**అన్నమయ్య జిల్లా బ్యూరో, మార్చి 02 - (రిపబ్లిక్ న్యూస్) -**






రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం మదనపల్లి పట్టణంలోని రామ తులసి కన్వెన్షన్ నందు సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. రాజంపేట పార్లమెంట్ నూతన అధ్యక్షుడిగా సుగవాసి ప్రసాద్ బాబు తో పాటు నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఏడు నియోజకవర్గాల నుండి సుమారు 10 వేల మందికి పైగా కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. మదనపల్లి కు విచ్చేసిన ప్రసాద్ బాబును తెలుగు తమ్ముళ్లు భారీ ఎత్తున పలికి క్రేన్ సహకారంతో భారీ గజమాలతో స్వాగతం పలికారు. ఇది కార్యక్రమ నిర్వహణకు పెద్ద హైలెట్ గా నిలిచింది. ముఖ్య అతిథులుగా జిల్లా ఇంచార్జ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యేలు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, షాజహాన్ బాషా, రెడ్డప్పగారి శ్రీనివాసులు రెడ్డి, ఇంచార్జ్ లు రూపానంద రెడ్డి, జగన్ మోహన్ రాజు, చల్లా బాబు, కార్పొరేషన్ చైర్మెన్లు, డైరెక్టర్లు, రాష్ట్ర స్థాయి నాయకులు, టిడిపి సీనియర్ మహిళలు, తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబు, పల్లా శ్రీనివాసరావు లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. "నాయకులకు, కార్యకర్తలకు మధ్య సమన్వయకర్తగా ఉంటూ, ప్రతి కార్యకర్తకు అండగా నిలబడతానని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యేలు, ఇంచార్జ్ ల సమన్వయంతో కలిసి పనిచేస్తామని తెలిపారు. 2029 ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ స్థానాన్ని గెలుచుకోవడమే మా లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి నన్ను ఆశీర్వదించిన నాయకులకు కార్యకర్తలకు, అభిమానులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు..

# కేశవరెడ్డి పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

**విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి "ఉమెన్స్ ఇన్ సైన్స్" నినాదంతో ప్రత్యేక కార్యక్రమాలు**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 2)**










నగరంలోని వెంకటరమణ కాలనీలో ఉన్న కేశవరెడ్డి పాఠశాలలో 98వ జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం "ఎడ్యూ కార్నివల్" పేరుతో ఘనంగా వేడుకలు నిర్వహించారు. నర్సరీ నుండి పదవ తరగతి వరకు విద్యార్థులు పాల్గొని సైన్స్ డే సందర్భంగా వివిధ సబ్జెక్టులకు సంబంధించిన వినూత్న నమూనాలు ప్రదర్శించారు.
"లైఫ్ ప్రాసెసింగ్", "గ్లోబల్ వార్మింగ్", "ఐఆర్ సెన్సార్ సెక్యూరిటీ అలారం", చంద్రయాన్ 3, "క్షేత్రగణితం", "కన్స్యూమర్ కోర్టు" వంటి సైన్స్ మరియు సామాజిక అంశాలపై రూపొందించిన మోడళ్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. అలాగే తెలుగు జానపద కళల విభాగంలో అలనాటి కోలాటం, థింసా నృత్యం, హరిదాసు వేషధారణ, వైకుంఠపాళీ, తొక్కుడు బిళ్ళ వంటి ప్రదర్శనలు కనువిందు చేశాయి. చెట్ల సంరక్షణపై విద్యార్థులు నిర్వహించిన బుర్రకథ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
ఈ సందర్భంగా పాఠశాలల వ్యవస్థాపక అధ్యక్షులు యన్. కేశవరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న దేశవ్యాప్తంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు. 2026 సంవత్సరాన్ని "వికసిత్ భారత్ కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ" అనే నినాదంతో "ఉమెన్స్ ఇన్ సైన్స్ కాటలైజింగ్ వికసిత్ భారత్"గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి విజ్ఞాన ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ఆలోచనా శక్తి, సృజనాత్మకత పెంపొందించి వారి సర్వతోముఖ అభివృద్ధికి కేశవరెడ్డి పాఠశాలలు కట్టుబడి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, నగర ప్రజలు, యాజమాన్య సిబ్బంది పాల్గొన్నారు.

# తప్పుడు ఆరోపణలు ఖండించిన చర్చి పెద్దలు



**గుత్తి మార్చి 02 (రిపబ్లిక్ న్యూస్)**

గుత్తి పట్టణంలోని గుత్తి ఆర్ఎస్ లో ఉన్నటువంటి పునీత జోజప్ప దేవాలయంలో సోమవారం చర్చి పెద్దలు విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ సుమారు 90 కాథలిక్ క్రైస్తవ కుటుంబాలు విశ్వాసంతో జీవిస్తున్నాయి. ఈ దేవాలయం స్థాపన నుండి కాథలిక్ క్రైస్తవ విశ్వాసం, ఐక్యత, శాంతి మరియు ప్రేమకు ప్రతీకగా నిలిచింది. 80కి పైగా కుటుంబాలు తమిళ కాథలిక్ లు కాగా, మిగతా కుటుంబాలు తెలుగు కాథలిక్ లు. అయినప్పటికీ, ఈ దేవాలయంలో జరిగే అన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలు తెలుగు భాషలోనే జరుగుతున్నాయి. ఇక్కడ భాష, కులం, మతం వంటి ఎటువంటి విభేదాలు లేకుండా, అందరూ కలిసికట్టుగా, పరస్పర గౌరవంతో జీవిస్తూ వస్తున్నారు. ఇప్పటివరకు ఎటువంటి అనైక్యతా సంఘటనలు చోటు చేసుకోలేదు.
గతంలో అనేక మంది గురువులు ఇక్కడ సేవలందించారు. అలాగే, పాఠశాలలో సిస్టర్స్ అన్ని వర్గాల పిల్లలకు నిస్వార్థంగా విద్యను అందిస్తూ సమాజాభివృద్ధికి తోడ్పడుతున్నారు.
2024 ఏప్రిల్ నెలలో రెవరెండ్ గోరంట్ల జోహాన్నెస్ జానీయిస్ కర్నూలు పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత, కర్నూలు పీఠాన్ని విద్యా, వైద్య, సాంఘిక మరియు ముఖ్యంగా ఆధ్యాత్మిక రంగాలలో అభివృద్ధి చేయడానికి విశేషంగా కృషి చేస్తున్నారు.
ప్రత్యేకంగా, పోప్ ఫ్రాన్సిస్ సూచించిన 'కలిసి పయనించే సభ సినోడల్ చేర్చి ఆత్మను ప్రతి విచారణలో అమలు చేయాలనే ఉద్దేశంతో, విచారణ యూనిట్లు, సలహా సంఘం మరియు విచారణ హార్దిక సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు.
ఈ ఆదేశాల మేరకు, గుత్తి విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ ఏలియస్ , విచారణలోని ఏడు వార్డుల నుండి యూనిట్లను ఏర్పాటు చేసి, ప్రతి యూనిట్ నుండి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రతినిధులతో విచారణ సలహా సంఘాన్ని ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభించారు.
అయితే, ఈ సదుద్దేశ్యాన్ని సహించలేని కొంతమంది స్వార్థపరులు, "సలహా సంఘంలో మేమే ఉండాలి" అనే వ్యక్తిగత ఆశయాలతో, గురువుపై తప్పుడు ఆరోపణలు చేస్తూ విచారణ అభివృద్ధికి ఆటంకంగా మారారు. ఈ నేపథ్యంలో, ఆ వ్యక్తులు టీవీ



మాధ్యమాలను ఆశ్రయించి,గురువులు భాషాపరంగా విభజన చేస్తున్నారని,తమిళ ప్రజలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారని,తెలుగువారిని అణచివేస్తున్నారని,
కులపరంగా దూషిస్తున్నారనిఅనేక అసత్య ఆరోపణలు ప్రచారం చేశారు. ఈ ఆరోపణలు పూర్తిగా అబద్ధం మరియు ఆధారరహితం. ఇవి శాంతియుతంగా ఉన్న గుత్తి లో ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు మాత్రమే.
ఇటువంటి నిందారోపణలు సభను అపఖ్యాతిపాలు చేసే చర్యలు అని మేము స్పష్టంగా తెలియజేస్తున్నాము. అదేవిధంగా, కుమార్ అనే వ్యక్తి, గుత్తి పరిధిలోని పాఠశాలలో పనిచేస్తున్న సిస్టర్స్ కి సిబ్బందికి వాట్సాప్ ద్వారా అసభ్యకరమైన లైంగికంగా మరియు భయభ్రాంతులకు గురిచేసే సందేశాలు పంపుతూ వేధింపులకు పాల్పడుతున్న విషయం కూడా మా దృష్టికి వచ్చింది. దీనికి సంబంధించిన ఆధారాలు సంబంధిత అధికారులకు అందజేయబడుతున్నాయి. గుత్తి లో ఎల్లప్పుడూ శాంతి, ఐక్యత మరియు సత్య మార్గంలోనే నడుస్తుంది.
తప్పుడు ఆరోపణల ద్వారా చర్చి ప్రతిష్ఠను దెబ్బతీయాలని ప్రయత్నించే వారిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము

# మెగా హెల్పింగ్ ఫౌండేషన్ హైదరాబాద్ గారి ఆధ్వర్యంలో.మెగా ఉగాది ఐకానిక్ అవార్డ్స్

**మెదక్ జిల్లా ప్రతినిధి మార్చి 2 ( రిపబ్లిక్ న్యూస్)**



మెదక్ జిల్లా కు చెందిన నటరాజ కళ తోరణం విద్యార్థులు తమ ప్రతిభని చాటారు.ఏకంగా 12 మంది విద్యార్థులు ఈ అవార్డ్స్ గెలుచుకున్నారు.నాట్య గురువు జ.ఎ.శివాని గారు హర్షం వ్యక్త పరిచారు.అలాగే అవార్డు తీసుకొన్న పిల్లల తల్లి తండ్రులు చాలా సంతోషం చెందారు.మెదక్ జిల్లా కె మనిహారంగా మారిన నటరాజ కళతోరణం గురువు శ్రీమతి జష్ట.శివాని గారికి కృతజ్ఞతలు తెలిపారు.

# మెదక్ జిల్లా టిజిఆర్ఎస్ఏ సంఘం అధ్యక్షులు మహేష్ తరపున కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన శ్రీమతి ప్రతిమ సింగ్ ని కలసి సన్మానించడం జరిగింది.





**మెదక్ జిల్లా ప్రతినిధి మార్చి 2 ( రిపబ్లిక్ న్యూస్)** అనంతరం జిల్లాలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లను ప్రభుత్వం తొలగించకుండా తగిన చర్యలు తీసుకోగలరని సంఘం తరపున వినతి పత్రం సమర్పించారు. జి పీ ఓలకు సంబంధించి తెలంగాణ ఇంక్రిమెంట్ ని అమలు చేయు విషయమై నియోజకవర్గం లో పనిచేస్తున్న జిపిఓ లను ట్రాన్స్ఫర్స్ చేయు విషయమై వినతి పత్రం ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఇట్టి విషయాల గురించి కలెక్టర్ పరిశీలించి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# కర్నూలు జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ ని కలిసి పలు సమస్యల గురించి వినతి పత్రంఇచ్చిన వైయస్సార్సీపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి

**కల్లూరు ప్రతినిధి, మార్చి 02,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



సోమవారం రోజునకల్లూరు మండలం బస్తిపాడు గ్రామంలో యదేచ్ఛగా అక్రమంగా మట్టి తవ్వకాలు, ఇష్టానుసారంగా తవ్వకాలు చేస్తుంటే అధికారులు నిర్లక్ష్యంగావ్యవహరిస్తున్నారని. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వైఖరిని వదులుకొని అక్రమ తవ్వకాలను నిలిపి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ని కోరారు, అలాగే కర్నూలు నగరంలోని గుత్తి పెట్రోల్ బంక్ నుండి జాతీయ రహదారి సర్వీస్ రోడ్లను రింగ్ రోడ్డు వరకు మరమ్మత్తులు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో కర్నూలు జిల్లా కలెక్టర్ ని వైఎస్ఆర్సీపీ నాయకులతో కలిసి వీటిపై తగు చర్యలు తీసుకోవాలని అర్జీనిఅందజేశారు.అనంతరం ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఎస్పీ ని కలిసి ఇసుక తరలింపులో కూటమి ప్రభుత్వం నాయకులు పోలీసులు, వైసీపీ కార్యకర్తల ట్రాక్టర్ల పట్ల వివక్షత నిర్వహిస్తూ, ట్రాక్టర్లను అడ్డుకుంటున్నారని, ఇసుక తీసుకెళ్తున్న ట్రాక్టర్ల వారి పట్ల వివక్షత చూపుతున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా ఎస్పీ ని కలిసి అర్జీని అందజేసిన వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు,పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ఈ కార్యక్రమంలో కల్లూరు అర్బన్ 28 వ వార్డు కార్పొరేటర్ నారాయణరెడ్డి, బస్తిపాడు రమణారెడ్డి , పందిపాడు శివ శంకర్ రెడ్డి , శకునాల పుల్లారెడ్డి , చెట్ల మల్లాపురం మధు మరియు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# మెదక్ జిల్లా కౌడిపల్లి మండల బుజరంపేట గ్రామంలో పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టుకున్న పోలీసులు

**మెదక్ జిల్లా ప్రతినిధి మార్చి 2 (రిపబ్లిక్ న్యూస్)**



భుజరంపేట గ్రామంలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతుండగా పట్టుబడ్డ వ్యక్తులలో గ్రామానికి చెందిన గ్రామీణ ఉపాధి హామీ పథకంఫీల్డ్ అసిస్టెంట్ ఉండడం గ్రామంలో పెద్ద చర్చ గా మారింది గత కొన్ని రోజుల క్రితం ఉపాధి పనులు చేసిన కూలీలకుడబ్బులు పడకపోవడంతో పనిచేసిన కూలీలు తన ఫీల్డ్ అసిస్టెంట్ అమౌంటు తీసుకొని పేకాటలో నిన్న మెదక్ స్పెషల్ పార్టీకి దొరికిన ఫీల్డ్ అసిస్టెంట్ బుజ్రంపేట గ్రామానికి గ్రామంలోకి వెళ్తే ఎవరు కూడా ఇలాంటి వ్యక్తులను ఊరికే వదలకూడదని ప్రజలులేదు ఎన్నిసార్లు అన్న మేము చేసిన పైసలు పడలేవంటే మీ అకౌంటు బ్లాక్ అమ్మ అని చెప్పాడంట అని పనిచేసిన కూలీలు బలే బలే ఏడుస్తూ మాట్లాడారు ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ పైన కచ్చితంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఉపాధి హామీ కూలీలు మాట్లాడుతూ మేము చేసిన కష్టం నీకు ఎలాగో వస్తాది అలాగా పోతాది అని మాట్లాడారు నిన్న టాస్క్ ఫోర్స్ పోలీసులకు దొరికిన ఫీల్డ్ అసిస్టెంట్ కేసు నమోదు చేసిన కౌడిపల్లి ఎస్సై ఫీల్డ్ అసిస్టెంట్ పైన కేసు నమోదు చేసిన కౌడిపల్లిఎస్సై

# సంగారెడ్డి జిల్లా ఎస్పీ ని కలిసిన ప్లాట్ల బాధితులు

**ఆందోల్ ప్రతినిధి మార్చి 2( రిపబ్లిక్ న్యూస్ )**



ఉమ్మడి మెదక్ జిల్లా సంగారెడ్డి మండలం పోతిరెడ్డి పల్లి చౌరస్తా లోని సర్వేనెంబర్ 153/4 153/5 153/25 విస్తీర్ణం 3-20 గల భూమిలో 2007 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం లో ఉన్నటువంటి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గారి ఆధ్వర్యంలో పేదలకు 80 మంది కుటుంబాలకు పట్టా సర్టిఫికెట్లు జారీ చేయడం జరిగింది. మరియు పొజిషన్ కూడా చూపించడం జరిగింది. కానీ అక్కడ మౌలిక వసతులు లేనందున లబ్ధిదారులు అక్కడ నివాసం చేయలేకపోయినాము ప్రస్తుతం అక్కడ మౌలిక వసతులు అందుబాటులోకి వస్తున్న సందర్భంలో రోడ్లు వేసి కడీలు పాతడం లాంటి పనులను తెలియకుండా చేస్తున్నారు కాబట్టి పేదలకు ఇచ్చినటువంటి ప్లాట్లను యధావిధిగా ఇవ్వాలని స్థానిక ఎమ్మార్వో ఆర్ఐ ఆర్డీవో రెవెన్యూ అధికారులు గుర్తించి అక్కడ జరుగుతున్నటువంటి పనులను నిలుపుదల చేసి వాస్తవమైన నిరుపేదలైన పట్టాదారులకు న్యాయం చేయాలని కోరగా డీఎస్పీ ఎలాంటి సంబంధం లేని విషయంలో వచ్చి బాధితులను అనేక రకాలుగా బెదిరింపులకు గురి చేస్తున్నారని ఎస్పి గారికి తెలియపరచడంతో సానుకూలంగా స్పందిస్తూ డి.ఎస్.పి గారిని వారి విషయంలో ఎలాంటి జోక్యం చేసుకోకూడదని వారికి ఇచ్చినటువంటి ప్లాట్లు ఏవైతే ఉన్నాయో అవి రెవెన్యూ డిపార్ట్మెంట్ చూసుకుంటుందని ఎవరైనా మా పోలీస్ వాళ్ళు ఇబ్బంది పెడితే నాకు ఫిర్యాదు చేయమని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో బాధితులు పాల్గొన్నారు

# ఆలూరు నియోజకవర్గంలో ఎంపీ నాగరాజు సుడిగాలి పర్యటన

## పలు అభివృద్ధి పనులకు శ్రీకారం టీడీపీ నేతలతో ఎన్నికలపై చర్చ







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 2)**
కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు సుడిగాలి పర్యటన నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి తో కలిసి పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు మరికొన్ని పనులకు శంకుస్థాపనలు చేశారు.
ముందుగా దేవనకొండ మండల కేంద్రంలోని దివానే మూగి తాత ఉరుసు సందర్భంగా దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మండల టీడీపీ కార్యాలయంలో పార్టీ నేతలతో సమావేశమై రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు.
తరువాత ఆలూరులోని బెల్లగుండు ఆంజనేయ స్వామి ఆలయంలో ఎంపీ నిధులు రూ.70 లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్‌కు భూమి పూజ చేశారు. అలాగే ఆస్పరి మండలం పెద్ద హోతూరు గ్రామంలో ఎం.జీ.ఎన్.ఆర్.ఈ.జీ.ఏ నిధులు రూ.25 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఇక చిన్న హోతూరు గ్రామంలోని ప్రభుత్వ బీసీ వసతి గృహంలో ఎంపీ నిధులు రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన షెడ్డును ప్రారంభించారు. అదే గ్రామంలో ఎం.జీ.ఎన్.ఆర్.ఈ.జీ.ఏ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను కూడా ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ వెనుకబడిన ఆలూరు ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.
ఈ కార్యక్రమాల్లో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, రాష్ట్ర వాల్మీకి, కురువ కార్పొరేషన్ల చైర్మన్లు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాన్వి దేవేంద్రప్ప, రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్లు రామకృష్ణ, వెంకట రాముడు, ఉదయ్ కుమార్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మూగ బధిర చిన్నారులకు అత్యాధునిక సర్జరీలు విజయవంతం

**వినికిడి లోపం ఉన్న చిన్నారులు**
**శస్త్రచికిత్సలను ఉపయోగించుకోవాలి**
**జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పిలుపు**



**అనంతపురం కలెక్టరేట్, మార్చి 02,(రిపబ్లిక్ న్యూస్):**
వినికిడి లోపం ఉన్న పిల్లలు రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో పూర్తి ఉచితంగా చేస్తున్న కోక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలను ఉపయోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ పేర్కొన్నారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో నేడు ప్రపంచ శ్రవణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో డా.ఎన్టీఆర్ వైద్య సేవ కార్యక్రమం కింద కిమ్స్ సవేరాలో 50కి పైగా కోక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు పూర్తి చేయగా, శస్త్రచికిత్సలు పూర్తి చేసుకున్న చిన్నారులకు కిట్లను జాయింట్ కలెక్టర్ పంపిణీ చేశారు.

**స్క్రీనింగ్ పరీక్షల ద్వారా అర్హులైన పిల్లలను గుర్తింపు**
ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో డా.ఎన్టీఆర్ వైద్య సేవ కార్యక్రమం కింద సవేరాలో 50కి పైగా మూగ, బధిర చిన్నారులకు అత్యాధునిక 'కాక్లియర్ ఇంప్లాంట్' సర్జరీలను విజయవంతంగా పూర్తి చేయడం సంతోషకరమన్నారు. ఖరీదైన సర్జరీలను ప్రభుత్వ సహకారంతో పూర్తి ఉచితంగా అందించడం జరిగిందన్నారు. స్క్రీనింగ్ పరీక్షల ద్వారా అర్హులైన పిల్లలను గుర్తించి, వారికి శస్త్రచికిత్సలు నిర్వహించి, తద్వారా వినికిడి యంత్రం సహాయం లేకుండానే సహజంగా వినగలిగే శక్తిని కల్పిస్తున్నారన్నారు. మూగ, బధిర చిన్నారులు ఎవరైనా సంప్రదించినా ఉచితంగా శస్త్రచికిత్సలు చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయడం పట్ల చిన్నారుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, సవేరా హాస్పిటల్ సిఈఓ సిద్ధారెడ్డి, ఈఎన్టి స్పెషలిస్ట్ డా.రాఘవేంద్రరెడ్డి, పీఆర్ గిరి, సిబ్బంది, చిన్నారులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

# రాహుల్ గాంధీని కలసిన ఇమామ్ ఫ్యామిలీ

## ఇమామ్ కు అభినందనలు తెలిపిన రాహుల్ గాంధీ






**తెలంగాణ, మార్చ్ 02,(రిపబ్లిక్ న్యూస్):**
నూతన డిసిసి జిల్లా, సిటీ డిసిసి అధ్యక్షుల సంఘటన్ శ్రీజన్ అభియాన్ 10 రోజుల శిక్షణ పూర్తి అయింది. తెలంగాణ రాష్ట్రం వికారాబాద్ లో ఈ శుభ సందర్భంగా సోమవారం అనంతగిరి హరిత రిసార్ట్ కు రాహుల్ గాంధీ ఏపీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిలా రెడ్డి విచ్చేశారు. కార్యక్రమంలో భాగంగా నూతన డిసిసి అధ్యక్షుల కుటుంబ సభ్యులతో ఫోటో కార్యక్రమం నిర్వహించారు.

**కాంగ్రెస్ పార్టీ బలోపేతం కొరకు దిశా నిర్దేశం**
అనంతపురం సిటీ డిసిసి అధ్యక్షుడుగా శిక్షణ పూర్తి చేసుకున్న యం.యం.డి.ఇమామ్ గారికి ప్రశంస పత్రం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇమామ్ కుటుంబ సభ్యులతో రాహుల్ గాంధీ కాసేపు ఆత్మీయంగా గడిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఏపీ, తెలంగాణ డిసిసి అధ్యక్షులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ఉత్సాహపరిచారు. దేశ వ్యాప్తంగా ఉన్న రాజకీయ పరిస్థితులు, ఏపీలో బూత్ స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీ బలోపేతం కొరకు దిశా నిర్దేశం చేస్తూ ప్రజలతో మమేకం అవడం పై పలు సూచనలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలో తీసుకొని రావడానికి, ఏపీలో ఉన్న పరిస్థితులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. డిసిసి అధ్యక్షులు వారి బాధ్యతలను ఎవరైతే సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తారో వారికి ఎమ్మెల్యేగా, యం.పి గా, రాజకీయ ఎదుగుదలకు తన సహకారం అందజేస్తూ అండగా నిలుస్తానని రాహుల్ గాంధీ భరోసా ఇచ్చారన్నారు.

# రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గా దిన్నె శరత్ బాబు ఎన్నిక

**గుంటూరు వైద్యం, మార్చి02,(రిపబ్లిక్ న్యూస్):**



దిన్నె శరత్ బాబు (ఫైల్ ఫోటో):

అనంతపురం జిల్లా నాగలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ గా విధులు నిర్వర్తిస్తున్న దిన్నె శరత్ బాబును రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నుకోవడం జరిగింది. శనివారం గుంటూరు నగరంలోని ఏపీ ఎన్జీవో గృహంలో ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్య వర్గ సమావేశం నిర్వహించారు.

**కోవిడ్ లో ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించారు**
ఈ సందర్భంగా శరత్ బాబు మాట్లాడుతూ వైద్య రంగంలో ల్యాబ్ టెక్నీషియన్ల యొక్క ప్రాధాన్యత అత్యధికంగా ఉందని, వ్యాధిని నిర్ధారించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తారని తద్వారా వైద్యాధికారి రోగికి సరైన వైద్యం అందించగలరని తెలియజేశారు. గతంలో కోవిడ్ సమయంలో కూడా తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి సేవలు అందించారని కొనియాడారు. నేడు అనేక రకములైన పరీక్షలను కూడా నిర్ధారిస్తూ వైద్యరంగంలో అత్యధికంగా పనిచేస్తున్న ప్రతి ఒక్క ల్యాబ్ టెక్నీషియన్ కి పేరుపేరునా నమస్కారాలు తెలియజేశారు.
ప్రభుత్వాలు చేసే పనిని గుర్తించి వారికి రావాల్సినటువంటి మినిమం టైం స్కేల్ , హెల్త్ కార్డ్స్ , ఉద్యోగ బదిలీలు మెడికల్ లీవ్స్ వంటివి న్యాయపరంగా చెందవలసిన టువంటి వారి హక్కులను అందించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఆయన తెలియపరిచారు.

# కరాటే పోటీల్లో సత్తా చాటిన అనంత విజేతలు

## టెక్నికల్ డైరెక్టర్ (జె.ఎస్.కె.ఎస్) జి.కులశేఖర్



**మచిలీపట్నం స్పోర్ట్స్, మార్చి 02,(రిపబ్లిక్ న్యూస్):**
కృష్ణాజిల్లా మచిలీపట్నంలో మార్షల్ ఆర్ట్స్ కరాటే పోటీల్లో అనంత విద్యార్థులు సత్తా చాటారని టెక్నికల్ డైరెక్టర్ (జె.ఎస్.కె.ఎస్) జి.కులశేఖర్ పేర్కొన్నారు. వీటిలో భాగంగా ఆల్ ఇండియన్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలు వరల్డ్ కరాటే ఫెడరేషన్ ఆధ్వర్యంలో జపాన్ షటోరియో కరాటే ట్రైనింగ్ స్కూల్ అసోసియేషన్ ఆదివారం మచిలీపట్నంలోని పోలీస్ ఫంక్షన్ హాల్ లో ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ డైరెక్టర్ (జె.ఎస్.కె.ఎస్) జి.కులశేఖర్ నిర్వహించారు. చీఫ్ జనరల్ సెక్రటరీ డి.ప్రభాకర్ మాస్టర్ పాల్గొన్నారు. ఈ పోటీలో వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 450 కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. తాడిపత్రి గన్నవారిపల్లె కాలనీ సచివాలయం దగ్గర మార్షల్ ఆర్ట్స్ జపాన్ షటోరియో కరాటే ట్రైనింగ్ స్కూల్ క్రీడాకారులు 17 మంది పోటీల్లో పాల్గొన్నారు. అండర్ 11, అండర్ 14, కట్ట విభాగంలో పి.నేత్రావతి, సివి. వర్షిని, పి. మిథున్ రెడ్డి, కే. మనోహర్ ప్రథమ స్థానం, జ్ఞాన సాహితీ, రంగ తులసి,ఇంద్రాణి, హేమలత ద్వితీయ స్థానం,దర్శిని,మనస్విని, ఇంద్రావతి, మాధవి, దినేష్ కుమార్,వెంకట సాయి తృతీయ స్థానం సాధించారు. వీరికి కప్ లను అందజేసిన అనంతరం ప్రశంస పత్రాలను అందజేశారు. కమిటీ(ఫైట్) విభాగంలో వర్షిని,ఇంద్రావతి, ఈశ్వర్ ప్రథమ స్థానం కప్స్ సర్టిఫికెట్స్ సాధించారు. మనస్విని రన్వీర్,లావణ్య మాధవి, నేత్రావతి, వెంకట సాయి, రంగ తులసి,జ్ఞాన సాహితీ, దర్శిని మిధున్ రెడ్డి,మనోహర్ ద్వితీయ తృతీయ స్థానం సాధించారని విజేతలకు కప్ లతో పాటు ప్రశంస పత్రాలను అందజేశారన్నారు.ఈ పోటీలకు బి.రాగ శ్రీ కోచ్ గా వ్యవహరించారు. పోటీలలో ధైర్యసహసాలతో పాల్గొనాలని విద్యార్థుల తల్లిదండ్రులన్నారు. పోటీలలో విద్యార్థులు దినాదినాభివృద్ధి చెందాలని, అంతర్జాతీయ క్రీడలలో ఆడాలని మార్షల్ ఆర్ట్స్ కరాటే మాస్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఈ పోటీలో ఆదినారాయణ, జి. మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణకు డబ్బులు ఇవ్వరు




- భూ యజమానురాలకు ఇబ్బందులు
- తాసిల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలే
- రూ. 17 లక్షలు డబ్బులు కాజేసేందుకు
- రెవెన్యూ అధికారుల కుట్ర
- భూమి ఒక సామాజిక వర్గం వారిది
- వేరొక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తితో లాలూచి




**రిపబ్లిక్ క్రైమ్ స్టోరీ, మార్చి 02, అనంతపురం**

ఉన్న భూమి కాస్త ఆసరా ఉంది అనుకుంటే ఆ పేదింటి మహిళకు నిరాశే ఎదురవుతోంది.సంవత్సరం పాటు చెప్పులు అరిగేలా తహసిల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగినా కూడా ఏ ఒక్క అధికారి స్పందించిన పాపాన పోలేదు. ఒంటరి మహిళ అందులోను వయసు పైబడిన వ్యక్తి ఆమె. కూలి పనులకు వెళితే తప్ప పూట గడవని పరిస్థితి ఆమెది.ఆమె పేరు మీద 1.45 సెంట్లు భూమి ఉంది. వాటిలో 56 సెంట్ల భూమి ఎన్ హెచ్ /544 రోడ్డు విస్తరణకు వెళ్ళింది. ఒక్కో సెంటుకు రూ 30 వేల రూపాయల చొప్పున 56 గంటలకు గాను రూ. 16 లక్షల 80 వేల రూపాయలు రావాల్సి ఉంది. ఈ సొమ్ము మొత్తాన్ని ఆమెకు ఇవ్వకుండా అధికారులు అడ్డుపడుతున్నారు. నార్పల మండల తహసిల్దార్, మండల సర్వేర్, వీఆర్వోలు కలిసి మొత్తం సొమ్మును కాజేయాలని ఎత్తుగడలేశారు. ఆమె
నిరుపేదరాలు అందులోనూ చదువు లేకపోవడంతో అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని సొమ్మును మొత్తం ఒక్కొక్కరకు కొంత భాగాన పంచుకునేందుకు రెవెన్యూ అధికారులు పన్నాగం పన్నారు.

### అధికారులు సంతకం చేయమని అనేకమార్లు ఒత్తిడి

అనంతపురం జిల్లా నార్పల మండలం మద్దలపల్లి గ్రామానికి చెందిన సప్పర పద్మావతి భర్త చిన్న నారాయణ. వీరికి వెంకటం పల్లి రెవెన్యూ గ్రామ పొలం సర్వేనెంబర్ 34/4/ఏ 2లో 1.45 ఎకరాల భూమి ఉంది. జాతీయ రోడ్డు విస్తరణలో భాగంగా 56 సెంట్ల భూమి రోడ్డు విస్తరణకు వెళ్ళింది. వీరికి మొత్తం రూ. 16 లక్షల 80 వేల రూపాయలు రావాల్సి ఉండగా ఈ మొత్తం డబ్బులను రాకుండా తహసిల్దార్, మండల సర్వేర్, వీఆర్వో పన్నాగం పన్నారు. ఎలాగైనా వారి డబ్బులను కాజేయాలని.. వీరి భూమిపక్కన ఉన్న ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తితో లాలూచీ పడ్డారు. సప్పర పద్మావతిని రెవెన్యూ అధికారులు సంతకం చేయమని అనేకమార్లు ఒత్తిడి చేసినట్లు ఆమె తెలిపారు. ఆమె సంతకం చేసిన దానికి గాను రూ. పదివేల రూపాయలను అందజేస్తామని చిలక పలుకులు పలికారు. మోసపోతానని గ్రహించి ఆమె సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలలో కలెక్టర్ కు తమ బాధను విన్నవించుకోవడానికి ఆమె రావడం జరిగింది.

### వచ్చిన డబ్బులని తీసుకొచ్చి ఇవ్వమని డిమాండ్

అంటే భూ యజమానిరాలు అయి ఉండి కూడా రోడ్డు విస్తరణలో భాగంగా ఆమెకు రావాల్సిన మొత్తాన్ని వేరొక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తితో రెవెన్యూ అధికారులు లాలూచీ పడడం వాస్తవం కాదా... బాధితురాలు పక్షాన నిలవాల్సిన అధికారులే అనేక తప్పులను చేసి వాటిని కప్పిపుచ్చేందుకు మరల.. వేరొక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి అనుగుణంగా అర్జీలను రాయడం అంటే వీటిని ఎలా పరిగణలోకి తీసుకోవాలనేదే ప్రశ్నార్థకంగా మిగిలింది.నిజమైన భూ హక్కుదారునికి అధికారులు న్యాయం చేయరని ఈ సంఘటనతోనే తేటతెల్లమైంది. రెవిన్యూ అధికారులు బాధితురాలు సొమ్మును మరో సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి.. వచ్చిన డబ్బులని తీసుకొచ్చి ఇవ్వమని డిమాండ్ చేయడం ఎంతవరకు సమంజసం. అంటే దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్నట్లు. రెవెన్యూ అధికారులు భూ హక్కుదారునికి న్యాయం చేయకుండా మరో వ్యక్తికి పరోక్షంగా లబ్ధి చేకూరుస్తున్నారు.
ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చొరవచూపి తనకు

### రూ.16 లక్షల 80 వేల కోసం అధికారులు కక్కుర్తి

అయితే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ తీసుకొని తన గోడును వెల్లబుచ్చింది. పి జి ఆర్ ఎస్ లో రెవెన్యూ క్లినిక్ లో అర్జీ రాసుకున్న ఆమె అర్జీ పై సంతకం చేయమని తాసిల్దార్ ను అడగగా.. బాధిత పద్మావతి ఇచ్చిన అర్జీ తీసుకున్న తాసిల్దార్, సర్వేర్, వీఆర్వోలు రెవెన్యూ క్లినిక్ స్టేటస్ ను రెవిన్యూ అధికారులకు అనుగుణంగా రాసుకున్న సంఘటన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వెలుగులోకి వచ్చింది. ఏకంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనే బాధితురాలికి అనుగుణంగా రాయాల్సిన రెవిన్యూ అధికారులు కలిసి .. పద్మావతికి చెందాల్సిన రూ.16 లక్షల 80 వేల రూపాయలను పక్కదారి పట్టించే విధంగా రెవెన్యూ క్లినిక్ స్టేటస్ వాళ్లకి అనుగుణంగా రాసుకోవడం ఇంత దారుణమేంటని బాధితురాలు పద్మావతి కన్నీటి పర్యంతమయ్యారు.

### వడ్డే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తితో రెవిన్యూ అధికారులు కుమ్మక్కు

కనీసం మండల తాసిల్దార్ కనికరించకపోవడం దేవుడెరుగు, సర్వేర్ బాధితురాలు ఇచ్చిన అర్జీకి బదులు ..బాధితురాలు పొలానికి ఆనుకొని ఉన్న మరో సామాజిక వర్గం వారికి అనుగుణంగా రెవెన్యూ స్టేటస్ ను రాయించడం ఎంతవరకు సమంజసం. ఒక సంవత్సరం పాటు తహసిల్దార్ కార్యాలయాలు చుట్టూ తిరిగినా కూడా సమస్య పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యం వహించారు. బాధితురాలు జిల్లా కలెక్టర్ కు విన్నవించుకోవడానికి వస్తే... అధికారులు బాధితురాలిని పక్కదోవ పట్టించడమే గాక... ఆమెకు చదువు రాదు అనే దురుద్దేశంతోనే ... అధికారులకు అనుగుణంగా ఏకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో" ఏకంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో" రెవెన్యూ క్లినిక్ లో ... మరో సామాజిక వర్గానికి చెందిన వ్యక్తితో కుమ్మక్కైన రెవిన్యూ అధికారులు బాధితురాలి రూ.16 లక్షల 80 వేలను కాజేచేసేందుకు కుట్ర పన్నిన విషయం వెలుగు చూసింది.




మీడియాతో మాట్లాడుతున్న భూ యజమానురాలు పద్మావతి

### అక్రమార్జన అధికారులను కలెక్టర్ సస్పెండ్ చేయాలి

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలను విన్నవించుకోవడానికి జిల్లా నలమూలాల నుంచి వివిధ సమస్యలతో బాధితులు వస్తుంటారు. సమస్యను విన్నవించుకున్న సందర్భంలో అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంది. మండల స్థాయి పరిధిలో అధికారులు న్యాయంగా, సక్రమంగా విధులు నిర్వర్తిస్తే... అంతమంది లబ్ధిదారులు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి జిల్లా నలమూలల నుంచి వ్యయ ప్రయాశాల కోర్చి రావాల్సిన అవసరం ఉండదు. వచ్చిన బాధితులకు అధికారులు సమన్వయంతో పని చేయాల్సి ఉంది. కానీ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులు బాధితులకు న్యాయం చేయకపోగా .. అధికారులే బాధితురాలకు ఆపోజిట్ ఉన్న వాళ్లతో కుమ్మక్కై నిండా అక్రమంగా సంపాదిస్తున్నారు. దానికి ఈరోజు సంఘటనే సాక్ష్యం. జిల్లాలో అక్రమార్జనే దేయంగా పనిచేస్తున్న రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేయాలి.

### ఈ సర్వే నెంబర్ 34/3 ను అధికారులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసం

నార్పల తాసిల్దార్, సర్వేర్ భూ హక్కుదారునికి ఉన్న సర్వే నంబర్ 34/4/ఏ /2 ను పి జి ఆర్ ఎస్ అర్జీలో రాయకుండా.. ఈ భూ హక్కుదారుని పక్కనున్న వారి సర్వే నెంబర్ 34/3 ను అధికారులు నిర్లక్ష్యంగా నమోదు చేయడం ఎంతవరకు సమంజసం. అందులోనూ నిజమైన భూహక్కుదారులు ఏకంగా కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్ లో తమ అర్జీలను ఇస్తే... వాటిని కూడా అధికారులు తారుమారు చేసి రాయడం సభబేనా..అంటే నిజమైన భూహక్కుదారునికి అన్యాయం చేయడానికి తన వంతు భాగంగా... రెవిన్యూ అధికారులు వీరికి ఆపోజిట్ ఉన్న వ్యక్తులతో చేతులు కలిపి నిజమైన భూహక్కుదారుని సొమ్ము కాజేసేందుకు కుట్ర పన్నారు. వీరికి ఉన్న సర్వే నంబర్ ఒకటైతే... వేరొక సర్వేనెంబర్ రాయడం వెనుక ఆంతర్యమేమి. వీటిపై సమగ్ర విచారణ జరిపి జిల్లా కలెక్టర్ నార్పల తహసిల్దార్, సర్వేర్, వీఆర్వోలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది వేచి చూడాల్సిందే.

# దళితుల భూములను కబ్జా చేసేందుకు కుట్ర

- ఓ వర్గానికి వ్యక్తి బెదిరింపులు
- ఫేక్ డాక్యుమెంట్లతో దౌర్జన్యం
- ఆ వ్యక్తికి అధికారుల అండదండలు
- అధిక మొత్తానికి అమ్ముడుపోయిన అధికారులు
- దళిత భూ హక్కుదారులకు న్యాయం జరిగేనా
- జిల్లా కలెక్టర్ స్పందించి న్యాయం చేసేనా





**రిపబ్లిక్ క్రైమ్, మార్చి 02, తాడిపత్రి**

కంచే చేను మేసినట్లు .. భూ హక్కుదారుల భూములను ఓ వ్యక్తి దర్జాగా కబ్జా చేసేందుకు కుట్ర పన్నాడు. ఎన్నో ఏళ్లుగా కొన్న రిజిస్టర్ భూమిని అధికారులను అడ్డం పెట్టుకొని దళితుల భూములపై ఫేక్ పత్రాలను సృష్టించి యదేచ్ఛగా కబ్జా పాల్పడుతున్నారు. మండల తాసిల్దార్ కార్యాలయంలో అక్రమ సంపాదన లేనిదే కొంతమంది అధికారులకు నిద్ర పట్టడం లేదు. అక్రమార్జనకు అలవాటుపడ్డ అధికారులు అడ్డదారిలో లక్షల రూపాయలను సొమ్ము చేసుకుని కూడగట్టుకుంటున్నారు. వీఆర్వో దగ్గర నుంచి తాసిల్దార్ వరకు ఏసీబీలకు పట్టుబడిన సంఘటనలు ఎన్నో విధితమే. అయినా కూడా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు తహసిల్దార్ కార్యాలయాల్లో లంచాలకు అలవాటు పడ్డ అధికారులు అక్రమంగా సంపాదిస్తూ.. కోట్ల రూపాయలకు పడగలెత్తారు.

**గత 40 ఏళ్ల క్రితం ప్రతి రూపాయి పోగేసుకున్న భూమి**

అనంతపురం జిల్లా తాడిపత్రి మండల గన్నే వారి పల్లి పరిధిలోని సర్వే నెంబర్ 752/బి లో 1.06 ఎకరాల స్థలం ఉంది. 1992లోని రిజిస్టర్ భూమి. ఆ భూమి మొత్తం 42 మంది దళితులకు చెందింది. ఒక్కొక్కరికి రెండు సెంట్లు చొప్పున రావాల్సి ఉంది. అయితే ఆ ఫ్లాట్లలో కొంతమంది అనుభవంలో ఉన్నారు. కొంతమంది జీవనోపాధి కోసం వేరే ఊర్లకు వెళ్ళడంతో ఆ ఫ్లాట్ల యజమానులు కొంతమంది కలిసి.. ఉన్న ఎకరం ఆరు సెంట్లను సర్వే చేసి ఒక్కొక్కరికి రెండు చెట్లు చొప్పున సర్వే చేయమని అడిగితే. మండల రెవెన్యూ అధికారులు ఏ ఒక్కరూ స్పందించడం లేదు. భూ హక్కుదారులు దాదాపుగా మూడు సంవత్సరాలు తాసిల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగినా కూడా ఫలితం లభించడం లేదు. గత 40 ఏళ్ల క్రితం ఒక్కొక్క రూపాయి కూడగట్టుకున్న భూమి కోసం దళితులు పలు దపఫాలుగా ప్రభుత్వ తాసిల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా కూడా అధికారులు నిమ్మకుండిపోయారు. హక్కుదారులుగా ఉండి, అనుభవంలో ఉండి కూడా అధికారులను బ్రతిమాలు కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాడిపత్రి తహసిల్దార్ కార్యాలయంలో డబ్బులు ముట్ట చెపితే గాని సర్వే చేయడానికి రాని పరిస్థితి ఏర్పడిందని సదురు భూ హక్కుదారులు వాపోతున్నారు

**తాసిల్దార్, సర్వేర్ ల ప్రోత్బల్యంతో చంపుతా**

గత 40 ఏళ్ల క్రితం రిజిస్టర్ భూమిని కొన్నారు.అయినా కూడా ఆ భూమిని ఓ వర్గానికి చెందిన వ్యక్తి కాజేయాలని కుట్రపన్నారని దళళితులు ఆవేదన చెందుతున్నారు.ఓ వ్యక్తి దళితుల భూములపై దౌర్జన్యం చేస్తూ .. ఆ భూముల్లోకి
వస్తే చంపుతానంటూ బెదిరించడం ఎంతవరకు సమంజసం.ఆ వ్యక్తి మండల తహసిల్దార్ కార్యాలయంలోని కొంతమంది అధికారు ప్రోత్భల్యంతో దళితులపై కక్షకట్టడం, వారిని చంపుతామంటూ బెదిరించడం తాడిపత్రిలో చోటు చేసుకుంది.ఎన్నో ఏళు ్లగా ఆ భూమిని నమ్ముకుని బతుకు జీవుడా అని కాలమెల్లదీస్తున్న దళితులకు తాడిపత్రిలో రక్షణ కరువైంది.

**అధికారులు సర్వే చేయడానికి ముఖం చాటారు**

మండల రెవెన్యూ అధికారులు దళితుల భూములను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ దళితుల భూములోకి సర్వే చేయడానికి వెళితే ఓ వ్యక్తి అధికారులతో కుమ్మక్కై భూములను సర్వే చేయకుండా ఆపుతున్నాడు. అధికారులు ఆ వ్యక్తితో లాలూచీపడి డబ్బులు దండుకొని దళితులకు అన్యాయం చేస్తున్నారు. తండ్రి తన కూతుర్ల కోసం కొన్న భూమి, ఓ కూతురు భర్త చనిపోతే ఆమెకు కొంత స్థలాన్ని తండ్రి బాధ్యతగా ఇవ్వాల్సి ఉంది. మరో కూతురికి కూడా కొంత స్థలాన్ని ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు తండ్రి అయితే ఇచ్చేముందు భూ యజమానికి భూ సమస్య ఎదురయింది. రెవెన్యూ అధికారులు సర్వే చేయడానికి ముఖం చాటేసారు. సర్వే చేయాల్సిన అధికారులు డబ్బులు డిమాండ్ చేయడంతో దళితులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు.

**జెసిపి పెట్టి చదును చేయడం వెనుక అధికారుల పాత్ర**

రెవెన్యూ అధికారులు దళితుల భూములను ఓ వ్యక్తికి అప్పనంగా కట్టబెట్టేందుకు బేరసారాలాడినట్లు వ్యక్తం అవుతుంది. అక్షరాల దళితుల ప్లాట్లు ఒక్కో ఫ్లాట్ దాదాపు 12 లక్షల వరకు పలుకుతుంది. వీరు ఆ ఫ్లాట్లను అమ్ముకొని బాగుపడతారకున్నారేమో కానీ.. ఎట్టకేలకు ఆ భూములపై రెవెన్యూ అధికారులతో బేరం కుదుర్చుకున్నాడు ఓ వ్యక్తి. అదే అదునుగా వీరి ప్లాట్లను అమ్ముకునేందుకు పన్నాగం పన్నాడు. ప్లాట్లపై ఫేక్ డాక్యుమెంట్లను సృష్టించి ఏకంగా అమ్మడానికి సిద్ధమయ్యాడు. దళితుల భూముల్లో ఓ వ్యక్తి దౌర్జన్యంగా జెసిపి పెట్టి చదును చేయడం వెనుక రెవిన్యూ అధికారుల పాత్ర కీలకమనే చెప్పవచ్చు.

**అధికారులు అక్రమాస్తులను పోగేసుకుంటున్నారు**

తాడపత్రి మండల తహసిల్దార్ కార్యాలయంలో అధికారులకు ఏ వ్యక్తులైన లంచం ఇస్తే.. ఇట్టే ఎవరి భూములను అయినా ఆన్లైన్ నమోదు చేస్తారు. డి పట్టా, పట్టాదారు పాస్ బుక్కులు, వన్ బి, అడంగల్ ను ఇట్టే సృష్టిస్తారు. దీని ద్వారా అక్రమంగా సంపాదిస్తూ లక్షల రూపాయలను కూడగట్టుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ అధికారుల సైతం కోట్ల రూపాయలను కూడగట్టుకుంటున్నారు. దీంతో అక్రమాస్తులను యదేచ్ఛగా పోగు చేసుకుంటున్నారు.

**కలెక్టర్ భూ హక్కుదారులకు న్యాయం చేయాలి**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు తహసిల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ అధికారులు అడ్డుగోలు సంపాదనతో వ్యవహరిస్తున్నారు.అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఒకరి భూమిని మరొక వ్యక్తుల పేర్లు మీద నమోదు చేస్తూ ఎట్టకేలుకు ప్రజల రక్తాన్ని జలగల్లా పీల్చేస్తున్నారు. అమాయక ప్రజల భూములను యదేచ్ఛగా కాజేస్తున్న వారికి రెవెన్యూ అధికారులు చుట్టాలుగా మారారు. దీంతో అక్రమ సంపాదిన మూడు పువ్వులు ఆరు కాయలుగా మారింది. దీంతో అధికారులు ఒకరి భూములను మరొకరికి అప్పనంగా కట్టబెడుతున్నారు.
దీంతో భూ హక్కుదారులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా ఏళ్ల తరబడి తిరుగుతూనే ఉన్నారు. కానీ బాధితుల సమస్య పరిష్కారం అవ్వదు. ఇప్పటికైనాజిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ చొరవ చూపి భూ హక్కుదారులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలి. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలి. అక్రమ మార్గంలో సంపాదిస్తున్న అధికారులను తొలగించాలి.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com